Cp 11075
C

02484

విక్రమోర్వశీయము

కాళిదాసకృతికి తెనుగు

మల్లంపల్లి శరభయ్య.

జనమంచి - ప్రచురణలు
రాజమండ్రి - 533 105
1986

894.8272
S.

మూల్యము రు 16/-

BLANK PAGE

CP 11075

విక్రమోర్వశీయము

కాళిదాసకృతికి తెనుగు

మల్లంపల్లి - శరభయ్య

జనమంచి - ప్రచురణలు
రాజమండ్రి - 533,105
1986

మూల్యము రు 16/-

ప్రథమ ముద్రణము - జనవరి 1986 - ప్రతులు 500

సర్వస్వామ్యములు - (అంతర్జాతీయ హక్కులతో)

మల్లంపల్లి - శరభయ్యశర్మవి

జనమంచి ప్రచురణలు - 4

మూల్యము రు 16/-

ముద్రణము :-

సరస్వతీ పవర్ ప్రెస్ - రాజమండ్రి

ప్రాప్తిస్థానము :

జనమంచి ప్రచురణలు

(1) రాజమండ్రి 533,105

(2) మల్లంపల్లి - శరభయ్య శర్మ

మల్లయ్యపేట

రాజమండ్రి - 533,105

శాపవిముక్తి

కవికులగురువు కావ్యసంతానములో విక్రమోర్వశీయ మేఘసందేశములు రెండును కవలపిల్లలు!

వాని నిర్మాణములో శాపగ్రస్తమైన ప్రణయము వస్తువు ఈ విక్రమోర్వశీయము నేను తెనుఁగుచేయుటకు మొదలుపెట్టి విప్రలంభాంకము వఱకు చేసి నేటికి ముప్పదిమూఁడేండ్లయినది.

అట్లే కీ॥శే॥ జనమంచి వేంకటరామయ్యగారు మేఘసందేశము తెనుఁగుచేయుటకు మొదలుపెట్టి ఉత్తరమేఘములో సందేశమువఱకు చేసిరి. ఆ రచన నిలిచిపోయి నేటికి యేఁబదిమూఁడేండ్లయినది.

ఇట్లు - ఈ యనువాదములుకూడ శాపగ్రస్తములే అయినవి. విధివిధానము అచింత్యహేతువు!

జీవిత పశ్చిమార్ధములో నన్ను అన్వేషించికొనుచు శైలతనయా చరణరాగసంభవమైన సంగమనీయమణివలె శ్రీ కామేశ్వరరావుగారు తటస్థపడి యీ రెండింటి శాపము తొలఁగుటకు నిమిత్తకారణమైనారు.

ఆయనరూపమున నన్ను చేరవచ్చిన యీ అదృష్టసంకల్పబలమునకు అంజలిఘటింతును.

మల్లంపల్లి శరభయ్యశర్మ
6-1-1986

శ్రీః

సంప్రదీయత ఇయంకృతిర్మయా
కావ్యజన్మని మమాగ్రజన్మనే
నూత్న కావ్యవచసాం విధాయినే
శేష పూర్వ సుకవీంద్రవేధసే ॥

యేనా పూర్వమహార్ఘరత్నఘృణయ స్సాహస్ర మావిష్కృతాః
వల్మీకాంతర గూఢగాఢమహసః ప్రాచేతసస్యోక్తిషు
ఆశ్చర్యం సుధియా మపశ్చిమధియాం వైపశ్చితీ కాఽప్యసౌ
శేషేంద్రస్య గిరాంతనోతి సరణిః కావ్యాత్మతేజోఽరణిః ॥

గ్రంథగ్రంథిషు యన్నిజేషు వివృతిః స్వేనాత్మనాదర్శితా
శాస్త్రోక్తిష్వపి యేన యత్ ప్రియతమా సల్లాపలీలాయితం
దేవీవాక్ స్వయమస్య యద్వివృణుతే రీత్యుజ్జ్వలాంస్వాం తనూం
శ్రీహర్షః కిము రాజశేఖర ఉత శ్రీనాథ ఏష స్వయమ్ ॥

యస్సర్వగం సర్వత ఆపశ్యహృష్టో
జ్యోత్స్నాసు మేఘేషు ధునీవనీషు
జగౌ లతాంతేషు విహంగమేషు
గీతిం మనః ప్రాణసుఖావహాం నః ॥

కవీనాం సేనాన్యే ప్రబలకుకవిక్రౌంచదళన
స్ఫురద్గీర్బాణౌఘ ప్రసృమర మహాసేన మహసే
శివాం బ్రూమో వాచం శివయువతి పాదాబ్జవికస
ల్లలాట జ్యోత్స్నాయ ప్రకటమిహ శేషేంద్రకవయే ॥

మహచ్చిత్రమేతన్మహచ్చిత్రమేతద్
గిరేర్నందినీ చేందిరా ద్వే మిళిత్వా
పరంకౌతుకాదాంధ్ర వాగ్దేవతాయాః
స్నుషాత్వం ప్రపన్నే మృషానో వచోమే ॥

హావ్యాద్యన్నిరగాచ్ఛిరాద్భుతవిధి స్వస్రోస్తయోస్తు వై వేధసే
ద్వంద్వం యత్ స్పృహణీయశోభ మసృజ చ్చక్షుష్మతాంప్రీతయే
జ్యోత్స్నేవ చంద్రమసోర్యథైవ సుషమారాకా నిశాస్విందిరా
శేషేంద్రద్విజయో స్తథైవ ఘటనా సర్గస్య భూషావిధిః ॥

కోఽహం కావపిచయుహాం
కుతోను మయి హా పనీదృశీ ప్రీతిః
జానే నకిమపి కాంతిః
చాంద్రమసీ హ్లాదినీ స్వభావేన ॥

అభిమర్ణ ఇహాఽఽత్మా మే
వ్యథతే కేనాపి సౌహృదభరేణ
లభతాం నిభృతాం నిర్వృతి
ముభయోరిహ కావ్య సంప్రదానేన ॥

నమస్స్వయంభవే తస్మై లిపిదిక్కాల సంవిదే
హార్దాయ జ్వలతే నిత్య మార్ద్రాయైహాస్తు తేజసే ॥

మల్లంపల్లి శరభయ్యశర్మ

"దేవర నామనస్సరణి తెల్లముగామి, కలంగురీతి, నే
దేవరదౌ మనస్సరణి తెల్లముగామి, కలంగనైతినే
నావల పారిజాతశయనాంతరవీధుల నందనాంత సీ
మా వలమాన బాలపవమానము చిచ్చిడనేల నామెయిన్ ?"

శ్రీ

విక్రమోర్వశీయము

ప్రథమాంకము

ఉండు మిన్నును మన్నును నిండి యొక్కండయి
శ్రుతిశిరమ్ములు మాఱు మ్రోయ నెవఁడు
ఏ యొక్కనికె చెల్లు నీశ్వరశబ్దం
బనన్యార్థమై యథార్థాక్షరముగ
గాలింతు రెవ్వాని లోలో ముముక్షువు
లాయత ప్రాణేంద్రియాధ్వములను
ది క్కాలములు లేని యొక్కటి యైనను
స్థిరభక్తి యోగంబు చేర్చు నెవని
నజుఁడు హరియును దుది మొద లరయ లేని
తైజస స్తంభమై నిల్చి స్థాణువయ్యె
మూర్తు లెనిమిది ప్రత్యక్షములుగ వెలుఁగు
శివుఁడు మీ కిడుగాక ! నిశ్రేయసంబు

(నాంద్యంతమునఁ బ్రవేశించి)

సూత్రధారుఁడు

అతి విస్తృతి వలదు.

(తెరవంకఁ జూచి)

మారిషా ! ఒక్కసారి యిటు.

(ప్రవేశించి)

పారిపార్శ్వకుడు

బావా! ఏమి సెలవు?

సూత్రధారుఁడు

ఈపరిషత్తు పూర్వుల రసప్రబంధములను పలుమారులు చూచి యున్నది. నేఁడు కాళిదాస నిబద్ధ వస్తువగు నూతన త్రోటకముతో దీనిని ఆరాధింపఁ బోవుచు న్నాను. కావున - నటీనటులు తమ పాఠములలో శ్రద్ధాళువులై యుండవలయు ననిచెప్పుము.

పారిపార్శ్వకుడు

నీ ఆజ్ఞానుసారము. (నిష్క్రమించును)

సూత్రధారుడు

(సభకు నమస్కరించి)

ఆర్యులారా! సజ్జనులును సకల కళాకుశలులు నగు తమకు ఇప్పుడొక విన్నపము:

ప్రణయ కోమల మనః పరిణామమైన
జనముపై మీయెద నెనరు కల్గినను
విద్వజ్జనానంద విస్తారమైన
సద్వస్తు పురుషార్థి సమ్మతియున్న
ఆకాంతమై బుధు లవహితమతిని
శ్రీ కాళిదాసుని యీ కృతి వినుఁడు 2

[తెరలో]

" అయ్యలారా! రక్షించఁడి! రక్షించండి!
సురబంధువు లెవరయినా! ఆకాశచరు లెవరయినా!"

[చెవియొగ్గి]

ఏమిది ? నా విన్నప వెనువెంటనే ఆర్తములైన గోరింకలు
అఱచుచున్నట్లు ఆకాశమునుండి యీ శబ్దము !

కుసుమ రసమాద్య దళికులాఽకుల రవము లో !
క్రోల్చెనో గండుఁగోయిలల్ ! కొసరి దెసల !
సురగణ విషేవ్యమాణ మంబరము తెలని
యచ్చరల పాట కలచుదురాక్షసములో ! 3

(ఆలోచించి) అవును తెలిసినది.

నరసఖుఁ డా పురాణమునినాథుని యంకమె పాలవెల్లియై
సురభువనైక భూషయగు సుందరి నేఁడలకేశుఁ గొల్చి క్ర
మ్మరునెడఁ ద్రోవకాచి సురమత్సరు లూర్వశిఁ గొంచుఁబోయి, ర
చ్చరలదె ! యాలగోడయిన చాయ కడున్ గనికార మేచెడన్ 4

నిష్క్రమింతురు

ఇది ప్రస్తావన

(పిమ్మట - తెర దింపకయే రాజు రథముతో సారథియు ప్రవేశింతురు)

రాజు

మీరు కలఁగక యిటు రండు ! నేను సూర్యపరిచర్యనండి తిరిగి వచ్చు
చున్న పురూరవసుఁడను ! మీ యాపద ఎవ్వరి వలన ?

రంభ

రాక్షసుల గర్వము వలన -

రాజు

అది మీకేమి యపరాధ మొనర్చెను

రంభ

ఓ మహారాజ ! వినుము.

తపో విశేషముల వలన విశంకితుఁడైన వేళల మహేంద్రునికి సుకుమారమైన ఆయుధము రూప గర్వితయైన శ్రీదేవికి ప్రత్యాదేశము, సృష్టికి అలంకారమునగు, మా ప్రియసఖి ఊర్వశి నేఁడు కుబేర భవనమునుండి తిరిగివచ్చెడి త్రోవలో ఆ దానవుఁడెవ్వఁడో చిత్రలేఖతో పాటు ఆమెను చెఱపట్టి తీసికొని పోయినాఁడు !

రాజు

ఆ తెక్కలీడు ఏ దిక్కుగా వెళ్లెనో తెలియునా ?

అందఱు

ఐశాన్యముగా !

రాజు

అయినచో - ఇంక మీరు దిగులు విడువుఁడు
మీసఖిని తిరిగి తెచ్చుటకు ప్రయత్నింపఁగలను.

అందఱు

ఇది ఆ చంద్రుని కోవకు తగియున్న మాట !

రాజు

నాకై మీరెచ్చట నిలిచి ప్రతీక్షించెదరు ?

అందఱు

ఈ హేమకూట శిఖరము పైన -

రాజు

సూత ! ఐశానీ ముఖముగ త్వరగా గుఱ్ఱములను త్రోలుము !

సూతుడు

ఆయుష్మంతుని యానతిని - (గుఱ్ఱములను త్రోలును)

రాజు

(రథవేగము నిరూపించి)

బలే ! యీ రథవేగముతో ముందు వెళ్ళిన వైనతేయుని నైనను సమీపింపఁగలను. ఆ ఇంద్రాపరాధి ఒక లెక్కా ?

నేమిక్షుణ్ణ ఘనాగ్ర నిర్మిత రజోవిశ్రేణియై వేగ ధా
రా మధ్యద్రుత చక్రదర్శిత నవారశ్రేణియై పిళ్ళల
శ్రీ మచ్చామర మంజరీ హయ శిరశ్శృంగారమై చారుహే
లా మాద్యత్సమరేఖికా ధ్వజదుకూలంబై రథం బేగెడున్॥ 5

(రథముతో రాజు సారథియు నిష్క్రమింతురు)

సహజన్య

సఖులార ! ఆ రాజర్షి వెళ్ళినాఁడు. మనము హేమకూట శిఖరము చేరికొందుము.

మేనక

సఖీ ! అట్లే చేయుదము.

(అందఱు శిఖరాధిరోహణము రూపింతురు

రంభ

ఈ రాజర్షి మన హృదయ శల్యమును వెలార్పఁగలఁడా ?

మేనక

సఖీ ! నీకీ సంశయము కలుగరాదు

రంభ

దానవులు దుర్జయులు గదా !

మేనక

యుద్ధవేళలలో మహేంద్రుడంతటివాడు మధ్యమ లోకమునుండి సబహుమానముగ పిలిపించి ఆ రాజర్షినే విజయార్థమై సేనాముఖము నందు నియోగించుచుండును.

రంభ

సర్వథా విజయి అగుగాక :

మేనక

(క్షణమాత్రము మిన్నకుండి)

సఖులార ! దిగులు మానుడు దిగులు మానుడు ! ఇదిగో ! ! త్రుళ్ళింత లిడుచున్న లేడి అడియాలముతో సోమదత్తమైన ఆ రాజర్షి రథము ! ఈయన అకృతార్థుడై మరలడనుకొందును.

(నిమిత్తము నుపలక్షించి చూచుచు నిలిచియుందురు)

(పిమ్మట రథారూఢుడై రాజు, సారథి, చిత్రలేఖ దక్షిణహస్తముతో నూది పట్టికొనియున్న భయనిమీలితాక్షి యూర్వశియు ప్రవేశింతురు)

చిత్రలేఖ

ప్రియసఖీ ! తేరుకొనుము ! తేరుకొనుము !

రాజు

సుందరీ! తేరుకొనుము!

తొలఁగెవెలి బిత్తరీ! యసురులదెసన్ శ
తార ధారాళతాత్త భద్రములు మూఁడు
భువనముల్ వాలుగన్ను విప్లవము మఱేఁ?
వేగు తఱి పద్మిని నవారవిందము వలె 6

చిత్రలేఖ

అయ్యో! శ్వాసను పట్టి ప్రాణమున్నదనుకొనవలసినదే కాని యీమె
కిప్పటికిని మన తెలివి వచ్చుటలేదు

రాజు

నీ సఖి మిక్కిలి భయపడినది. కావుననే -

సాంద్ర వేపథు భయ పరిష్వంగ ముద్ర
తెలియ లేదయ్యె నింత కిందీవరాక్షి!
స్తన భరాఽభోగమున ముహుః శ్వసిత తరళ
మసృణ మందార కుసుమ దామకమె సాక్షి! 7

చిత్రలేఖ

(విచారముతో) సఖీ! ఊర్వశీ! కొంచెము నిబ్బరించుకొనుము.
మఱి అనప్సరసవలె గోచరించుచున్నావు!

రాజు

తలరని వెఱసోఁకి కానుండి యుండి
చెలువ పూవుటెడంద జలదరించుటలు
కుచ మధ్యమున నెగయుచు తూలివ్రాలు
సిచయాంచలమ్ములె వచియించుచుండె 8

(ఊర్వశి తేరుకొనును)

రాజు

చిత్రలేఖా! అదృష్టవంతురాలవు! నీ ప్రియసఖికి తెలివి వచ్చి ప్రకృతి స్థితురాలైనది. చూడుము.

తొఁగపు విందు దవ్వులను దోఁచిన చీఁకటి విచ్చు రేయినా,
నెగిసిన ధూమముల్ విరిసి నిల్చిన నైశహుతాశనార్చి నా,
ముగుద నిరస్త మోహయయి బోధ కలోదయవేళ కూలముల్
తెగి పడి క్రమ్మరన్ గలఁక దేఱు సురాపగలీల నేలెడున్ 9

చిత్రలేఖ

సఖీ! ఊర్వశీ! విశ్వసింపుము. ఆపన్నదయాళువైన యీ మహారాజు సురవిరోధులైన ఆ దానవులను హతాశులను జేసెను సుమా!

ఊర్వశి

(కన్నులు తెఱచి)

ఏమీ! ప్రభావ దర్శియైన మహేంద్రుఁడు నన్ననుగ్రహించెనా?

చిత్రలేఖ

మహేంద్రుఁడు కాఁడు. మహేంద్ర సదృశానుభావుఁడైన యీ రాజర్షి పురూరవసుఁడు!

ఊర్వశి

(రాజునుజూచి తనలో)

దానవ సంరంభము వలన ఎంత మేలు కలిగినది!

రాజు

(ఊర్వశినిజూచి)

తొల్లి - 'నారాయణ ఋషిని ప్రలోభ పఱుప వలయునని యేగిన అప్సరసలందఱును - తదూరు సంభవయైన యీమెను జూచి విలజ్జిత లైరి' - అనుటలో వింతయేమి ? ఒక వేళ యీమె తపస్వి సృష్టి కాదను కొందును - ఏలయన ?

వెలఁది మోహన సర్గవేళ ప్రాజాపత్య
మమృత దీధితి యందు ననువు పడెనొ !
కాంత యుజ్జ్వల రసైకా కారవదనంగ
వనజ సంభవ నూత్న వైధసంబొ !
రమణి చారు లతాంత సమ యోన్మిష చైత్ర
చైతన్య సముపాత్త సర్గమేమొ !
చెలువ సర్వాకార లలితాంశ పరభాగ
మిళిత రూప విశేష కలన యేమొ !

శ్రుతి సమభ్యాసజడ ముపహతమనోజ్ఞ
విషయబోధంబు సంయమి వృత్తమనఁగ
ఆ పురాణ మునీంద్రున కరసిచూడ
నీ మనోహరాకృతికిని నెంత దవ్వు !

ఊర్వశి

సఖీ ! చిత్రలేఖా ! సఖీ జనమెచ్చట నున్నదో కదా !

చిత్రలేఖ

అభయప్రదాత మహారాజే యెఱుఁగును.

రాజు

(ఊర్వశినిఁజూచి) మహా విషాదములో నున్నది. కాదా మఱి?

ఒక మఱి నీవు లీలమెయి నొక్కెడ నెవ్వనియేని చూడ్కి క
ల్మికిని నవంధ్యభావము ఫలింప వెలింగెద వింతనంత; ను
త్సుకత భజింపనాఁతడును; సుందరి! విన్నెద వీడలేని నీ
సకియల యా సమార్ద్రి మగు సౌహృద మింక వచింపనేటికిన్! 12

ఊర్వశి

(తనలో) నీమాట అమృతము! చంద్రుని నుండి అమృతముకాక-
మఱియేమి? (ప్రకాశముగ) ఇందువలననే చూచుటకు నా హృదయ
మారాటపడుచున్నది.

రాజు

(హస్తముతో నిర్దేశించుచు)

గుములయి త్వదాస్యమున-హేమకూట సఖులు
క్రోలెద రుపోషితాక్షి చకోరములను
గళిత విషమోపరాగ ప్రకామ సుభగ
యామినీధవ బింబదాయాద సుషమ 13

ఊర్వశి సాభిలాషముగఁ జూచుచుండును.)

చిత్రలేఖ

సఖీ! ఏమి చూచుచున్నావు?

ఊర్వశి

సమ దుఃఖ సంవేదనము లోచనములతోఁ గ్రోలఁబడుచున్నది.

చిత్రలేఖ

ఓసీ ! ఎవ్వరు ?

ఊర్వశి

ప్రణయిజనమే.

రంభ

(సహర్షముగ నవలోకించి) చిత్రలేఖాద్వితీయయైన యూర్వశితో విశాఖా సహితుఁడైన భగవంతుఁడు సోముని వలె రాజర్షి చేరువయై కానవచ్చుచున్నాఁడు !

మేనక

(నిరీక్షించి) సఖీ ! యిచ్చట మనకు రెండును ప్రియములే చేకూరినవి. మన ప్రియసఖి తిరిగి కొనిరాఁబడినది ఈ రాజర్షియు అపరిక్షత శరీరుఁడై కానవచ్చుచున్నాఁడు !

సహజన్య

సఖీ ! సరిగాఁ జెప్పితివి. 'దానవుఁడు దుర్జయుఁడ' ని-

రాజు

సూత ! ఆ శైల శిఖర మిదియే. రథము దింపుము.

సూతుడు

ఆయుష్మంతుని యానతి ! (రథము దింపును.)

(ఊర్వశి రథావతార క్షోభము రూపించుచు సత్రాసయై రాజును పట్టుకొనును.

రాజు

(తనలో) ఆహా ! నా విషమావతారము సఫలమైనది !

కూటపారోక్ష్యన్నమ ద్రథక్షోభవశత
నతివ నెమ్మేను నామేన నత్తమిల్లు
నమృతమయవేళ కంటకితాంగకముల
కుసుమశరునకు నయ్యె నంకురితవేళ ! 14

ఊర్వశి

సఖీ ! కొంచెమవ్వలికి జరుగుము !

చిత్రలేఖ

ఎడము లేదు.

రంభ

ఇచ్చట - ప్రియకారియైన రాజర్షిని సంభావింతము రండు !

(అందఱు సమీపింతురు)

రాజు

సూత ! రథము చేరువకుఁ బోనిమ్ము !

క్షణ విరహ కాతరిత యిమ్మృగాక్షి కలియు
క్షణవిరహ కాతరితలైన సఖుల మఱల
మ్లాన జీవలతాళిఁ బ్రసూన మలర
నామని సిరియుఁ దీవల నలమి నటుల ॥ 15

(సూతుఁడు రథమును నిలుపును)

అప్సరసలు

మా భాగ్యవశమున మహారాజు విజయముతో వర్ధిల్లు చున్నాఁడు !

రాజు

సఖీ సమాగమముతో మీరును!

(ఊర్వశి చిత్రలేఖ కై దండగొని రథమునుండి దిగి)

ఊర్వశి

సఖులార! నన్ను బిగియారఁ గౌఁగిలించికొనుఁడు!
మిమ్ము తిరిగి చూడఁగల ననుకొనలేదు సుమా!

(సఖులు కౌఁగిలించి కొందురు)

మేనక

(సాశంసనముగ) సర్వథా మహారాజు కల్పశతము పృథివిని పరిపాలించుచుండవలయును.

సూతుడు

ఆయుష్మంతుఁడా! తూరుపుదెసనుండి మహావేగముతో రథము వచ్చుచున్న శబ్దము!

అక్కజము మేల్మి పసిఁడి త
ళుక్కన సాంగద భుజార్గళుండితఁ డెవఁడో!
యిక్కొండ నెత్తమున దిగు
క్రొక్కాఱు మెఱుంగు మొగిలు కొమరున నొరపై ॥ 16

అప్సరసలు

(చూచుచు) అహో! చిత్రరథుఁడు!

(చిత్రరథుఁడు ప్రవేశించును)

చిత్రరథుఁడు

(సబహుమానముగ రాజును జూచుచు)

అహో ! మహేంద్రోపకార పర్యాప్తమైన విక్రమ మహిమతో నీవు పెంపొందు చున్నావు.

రాజు

ఓహో గంధర్వరాజు! (రథము దిగి) స్వాగతము ప్రియసుహృదునకు!

(పరస్పరము హస్తములు స్పృశింతురు)

చిత్రరథుఁడు

వయస్య ! కేశి ఊర్వశి నపహరించుట నారదునివలన విని యామెను తిరిగి తీసికొనివచ్చుటకు శతమఖుఁడు గంధర్వసేనను ఆదేశించెను. మేము త్రోవలో - చారణులవలన నీజయోదాహరణము విని నిన్నిచ్చట చేరవచ్చితిమి. నీవీమెను పురస్కరించికొని మాతో మఘవునిఁ జూచుట సముచితము. పూజ్యుఁడగు మఘవునకు నీవు చేసిన యీప్రియము గొప్పది. చూడుమె !

నాఁడు పురాణ మునీంద్రుని
సూఁడిద ! యీ స్వర్గభూషసురపతి, కసుర
క్రోడాహృతిఁ దెరలిచి మఱి
నేఁడో ! నీయిడిన యుపద నెయ్యమవధియై ॥ 17

రాజు

సఖుఁడా ! యిట్లన వలదు.

మతి నూహింప నిలింప శత్రువుల సస్మద్విక్రమాటోపమై
శతధారోజ్జ్వలదోః ప్రభావమె సుమీ ! చక్కాడునొక్కుమ్మడిన్
క్షితిభృత్కందర లందుఁ బర్వుచు క్షుథాక్ష్వేడోగ్ర కంఠీరవ
ప్రతిరావంబె ఘటా చలద్ద్విరద కుంభక్షోద సంరంభియా ॥ 18

చిత్రరథుఁడు

నీ మాట సముచితము. అనుత్సేకమే విక్రమాలంకారము !

రాజు

సఖుఁడా ! శతమఖునిఁ జూచుటకు నాకిది సందర్భముకాదు. ఈమెను ప్రభు సమీపమునకు నీవే చేర్పుము !

చిత్రరథుఁడు

నీ తలంపు ననుసరించి - అప్సరసలార ! యిటు ఇటు !

(అందఱు బయలుదేరుదురు)

ఊర్వశి

(జనాంతికముగ) సఖీ ! చిత్రలేఖా ! ఉపకారియైన రాజర్షిని నేను వీడ్కొన లేకయున్నాను. నీవే నా మాట వగుము !

చిత్రలేఖ

(రాజును సమీపించి)

మహారాజ ! ఊర్వశి యిట్లు విన్నవించుచున్నది -
"మహారాజు ననుజ్ఞ గైకొని ప్రియసఖిని వలె మహారాజు కీర్తిని సురలోకమునకుఁ గొనిపోవనుంటి" నని -

రాజు

అట్లే - పునర్దర్శనమగునుగాక !

(గంధర్వ సహితముగ అందఱు ఆకాశోత్పతనము రూపింతురు.)

ఊర్వశి

(ఉత్పతన భంగము రూపించి)
అహో ! యీ లతా విటపము నందు ఏకావళియైన నా వైజయంతిక చిక్కుపడినదే !

(సవ్యాజముగ సమీపించి రాజును జూచుచు)

సఖీ ! చిత్రలేఖా ! దీనిని కొంచెము విడిపింపరాదా ?

చిత్రలేఖ

(విలోకించి - నవ్వి) అవును - గట్టిగ చిక్కుపడినది ! దీనిని విడిపింపనలవి కాదు.

ఊర్వశి

చాలును పరిహాసము ! విడిపింపవే దీనిని !

చిత్రలేఖ

అవును ! విడిపింపనలవికానట్లే తోఁచుచున్నది. అయినను ఇప్పటికి విడిపించెదను లెమ్ము !

ఊర్వశి

(నవ్వి) ప్రియసఖీ ! నీ యీ మాట గుర్తుంచుకొందువు గదా !

రాజు

(తనలో)

ఎంతటి మేలొనర్చితో గదే యెలదీవియ ! నాకు; క్రమశా
ఖాంతగృహీతహారలతవై గమనక్షణ విఘ్నకారివై !
అంతట నిల్చి, యయ్యమిషాంగన సుంతమలంగి లోచనో
పాంత మనోహరార్థవలితానన కానఁగనయ్యె వెందియున్

(చిత్రలేఖ ఏకావళి విడిపించును. ఊర్వశి రాజు వంకఁ జూచుచు నిట్టూర్పులో - పై కెగురుచున్న సఖులను జూచుచుండును.)

సూతుఁడు

ఆయుష్మంతుఁడా!

అదె! లవణోదధి దవ్వులఁ
ద్రిదశేంద్ర కృతాపరాధ దితిజశ్రేణిన్
విదలచి కలఁగు చొఱంబడు
పృదాకువనఁ జేరె వాయవీయం బిషుధిన్ ॥ 20

రాజు

అయిన - రథము చేరువగా నిలుపుము. ఆరోహింతును.

(సూతుఁడు యథోక్తమొనరించును. రాజు రథమారోహించును.)

ఊర్వశి

(సస్పృహముగ రాజువంకఁ జూచుచు)

ఉపకారియగు నీయనను మఱలఁ జూడగలుగుదునా !

(గంధర్వ సహితముగ సఖులతో నిష్క్రమించును)

రాజు

(ఊర్వశీ మార్గమువంక - ఉన్ముఖుఁడై చూచుచు)

అహో ! మదనుఁడు దుర్లభాభిలాషి కదా !

విరిఁ దెమలింపఁ గీడ్వడిన వృంతమనన్ మెయితూలి, నాయెదన్
దెరలిచి యంతరిక్షసరణింబడి దవ్వుల కీ నిలింప సుం
దరి వెడలించె; చంచుపుట దారిత హారి మృణాళ నాళికాం
తర సితతంతు కర్షణ వితానిత రాజమరాళికాకృతిన్ ॥ 21

(అందఱు నిష్క్రమింతురు)

ఇది ప్రథమాంకము

ద్వితీయాంకము

(పిమ్మట విదూషకుఁడు ప్రవేశించును)

విదూషకుడు

అద్దిరా అద్దిరా ! పరమాన్నము కంటబడిన నిమంత్రితోకునివలె ఈ రాజరహస్యముతో పగులబడనున్న నేను - ఈ జనా కీర్ణములో నాలుక కట్టుకొని యుండుట యసలే అసంభవము. వయస్యుఁడు ధర్మాసనమునుండి యెప్పటికి లేచునో ! అంతవఱకు మనుష్య సంచారములేవి యీ దేవచ్ఛంద ప్రాసాదము నెక్కి కూర్చుండును.

(పరిక్రమించి రెండుచేతులతో నోరు కప్పికొని కూర్చుండును)

(పిమ్మట - చేటి ప్రవేశించును)

చేటి

పట్టపుదేవి కాశీరాజ పుత్రి యిట్లాదేశించినది-

" ఓసీ ! నిపుణికా ! భగవంతుఁడగు సూర్యదేవుని సేవించికొని వచ్చినది మొదలు మహారాజు మనస్సు మనస్సులో లేదు.

ఆర్యమాణవకుని వలన - ఈ పరిస్థితికి కారణమేమో తెలిసికొని రమ్మసి "

ఆ బ్రహ్మబంధువును - ఏలాగున నేమరింపవలయునో కదా ! అయినను - తృణాగ్ర లగ్నమగు మంచు బిందువు వలె - ఆయన యందు రాజరహస్యము చిరకాలము నిలుచుననుకోను. ఆయనను వెదుకవలయును. (పరిక్రమించి చూచి) అదుగో ! ఆ లేఖ్యము నందలి వానరమువలె ఆర్యమాణవకుఁడు కదలక మెదలక ఏదో ఆలోచనలో మునిఁగియున్నాడు ! ఈయనను చేరఁబోయెదను.

(సమీపించి) అయ్యా ! వందనము.

విదూషకుడు

నీకు స్వస్తి! (తనలో) ఈ తుంటరిదాసి కంట బడినంతనే ఆ రాజ రహస్యము గుండె బద్దలు చేసికొని వెలికుబుకు నట్లున్నది!

(కొంచెము ముఖము కప్పికొని)

(ప్రకాశముగ) నిపుణికా! సంగీతముమాని – ఎక్కడికి ప్రయాణము?

నిపుణిక :

దేవి యాజ్ఞపై తమ దర్శనార్థమే!

విదూషకుడు

ఏమని? పూజ్యురాలి యాజ్ఞ!

నిపుణిక

ఆమె యీరీతిగ ననుచున్నది –

"ఆర్యమాణవకునకు నాపై దాక్షిణ్యము లేదు. దుఃఖింపరావి నేను దుఃఖపడుచుండ నా విషయమును పట్టించుకొనట లేదు" అని –

విదూషకుడు

నిపుణికా! ప్రియవయస్యుఁ డామెకేమి ప్రతికూలముగ నడచికొనెనా?

నిపుణిక

ప్రభువులు శూన్యహృదయులైయుండుట యెవరినిమిత్తమో ఆ స్త్రీ పేరుతో దేవిని పలుకరించిరి.

విదూషకుడు

(తనలో) ఏమిది? తనరహస్యము ను తానే బయట పెట్టికొనెనా? ఇఁక – బ్రాహ్మణుఁడను! నేనా? నాలుక ట్టికొని యుండఁ గలుగుట!

(ప్రకాశముగ)

'ఊర్వశీ !' అని పిలచెనా యేమి ?

నిపుణిక

అయ్యో ! ఎవ్వరా యూర్వశి ?

విదూషకుడు

'ఊర్వశి' యని ఒక అప్సరస ! ఆమె కనిపించినది మొదలు వెఱ్ఱియెత్తి – ఒక్క దేవినే యననేల ? బ్రాహ్మణుఁడను ! నన్ను తిండి తిననీయక బాధించికొని తినుచున్నాఁడు.

నిపుణిక

(తనలో) ప్రభువుల రహస్యదుర్గమును భేదించితిని ! ఇప్పుడు పోయి దేవికి విషయము నివేదింతును.

(అని బయలు దేరును)

విదూషకుడు

నిపుణికా ! కాశీరాజపుత్రికి నామాటగా విన్నవింపుము –

"ఈ మృగతృష్ణికనుండి వయస్యుని మఱలించుటకు ప్రయత్నించి మిక్కిలి అలసిపోయితిని. ఒక్కసారి నీ ముఖారవిందమును జూచినచో మఱలఁగలడు" అని –

నిపుణిక

ఆర్యుని యానతి ! (నిష్క్రమించును)

(నేపథ్యమునందు వైతాళికుఁడు)

జయము జయము దేవరకు !

ఆలోకాంత తమోనిబర్హణ శుభైకాధాన దీక్షాగురుల్
నాళీకాప్తుఁడు నీవు నెట్టుకొని యున్నారొక్క యుద్యోగమై
హాళిన్ రెండవజాము మింటి నడిచాయన్ సేదవో హేళియున్
గాలూఁదెన్ దిన షష్ఠభాగ మమరుంగా ! నీకు విశ్రాంతికిన్ 22

విదూషకుఁడు

రాజు

ఇదుగో ! ధర్మాసనమునుండి లేచి వయస్యుఁడీవైపే వచ్చుచున్నాడు. నేను పార్శ్వ పరివర్తి నయ్యెదను. (నిష్క్రమించును)

ఇది ప్రవేశకము

(పిమ్మట విరహియైన రాజు, విదూషకుఁడు ప్రవేశింతురు)

చూచినదియ మొదలు సురలోక సుందరి
యనియు నాయెడఁద నధివసించె
మరుని వింటఁ దెరలి తిరుగని విరియమ్ము
గంటు దారివెంట నంటివచ్చె. 23

విదూషకుఁడు

ఇంతకును — పూజ్యురాలగు ఆకాశీరాజపుత్త్రి యెంత బాధ పడుచున్నదో !

రాజు

(తేరిచూచి) రహస్యనిక్షేపమును రక్షించుచుంటివి కదా !

విదూషకుఁడు

(వెలవెలఁ బోవుచుఁ దనలో)

దాసి నిపుణిక నన్ను ముంచినది. లేనిచో వయస్యుఁ డిట్లేల యడుగును ?

రాజు

ఏల మిన్నకున్నావు ?

విదూషకుడు

నా నాలుక యింత బిగించి యుంచితిని. అందుచేత నీకుఁగూడ వెంటనే ప్రతివచనము వచ్చుటలేదు.

రాజు

మంచిది. ఇంక ఏవినోదముతో ప్రొద్దుపుచ్చుట ?

విదూషకుడు

మహానస శాలకు పోదము.

రాజు

అచ్చట నేమున్నది ?

విదూషకుడు

అచ్చట - భక్ష్య భోజ్య చోష్య లేహ్య పానీయముల నిమిత్తము చేర్చిన ఆయా సంభారముల మేళనము చూచుచు కొంతదిగులు మఱచిపోవచ్చును.

రాజు

ఈప్సిత సాన్నిధ్యమువలన నీ కచ్చట కాలక్షేపమగును. దుర్లభ ప్రార్థనమైన నామనస్సును వినోదింపఁ జేయుట యెట్లు ?

విదూషకుడు

నీవుకూడ - ఆ యూర్వశీ దర్శన పథమునఁ బడినావు గదా !

రాజు

అయిన నేమి ?

విదూషకుడు

ఆమె నీకు దుర్లభురాలు కాదనియే తలంచెదను.

రాజు

ఆమె పట్ల సురూపమునకుఁ గల పక్షపాతము కూడ వలౌకికమే.

విదూషకుడు :

నీవిట్లు చెప్పుచున్నకొలది నా కుతూహలము పెరుగుచున్నది. ఏమి ? ఆ యూర్వశి సురూపమంత సాటిలేనిదా ? నా కురూపమువలె ?

రాజు :

మాణవక ! ఆమెయెడల ప్రత్యవయవ వర్ణన మశక్యము. మొత్తము మీఁద వినుము.

విదూషకుడు :

అవహితుఁడ నోయీ !

రాజు

తగు సోయగమునకు నగ జిగి యిడఁగ
జిగియిడు నగలకు మగువ సోయగము
ఒడలి వన్నియ మేల్మిదొడయఁ గైసేత
దొడయు గైసేతల పడఁతి మైవన్నె
ధరలోన సర్వసౌందర్య బోధంబు
నరయంగఁ దా నుపమాధీప మనిన
అపురూపమైన య య్యచ్చర పొలఁపు
ఉపమానములకుఁ బ్రత్యుపమానపదవి 24

విదూషకుడు

దివ్య రసాభిలాషివై నీవు చాతకవ్రతము పట్టుట యిందుకే కదా ! ఇప్పుడు నీ ప్రయాణ మెచ్చటికి ?

రాజు

ఏకాంతముకంటె విరహికి శరణ్యము లేదు. కావున నీవు ప్రమదవన మార్గ మాదేశింపుము.

విదూషకుడు

(తనలో) ఏమిగతి ? (ప్రకాశముగా) ఇటు ఇటు !

(అని పరిక్రమింతురు)

ప్రమదవన పరిసర మిదియే ! అతిథివగు నీకు వినమ్రమగు దక్షిణానిల మెదురు వచ్చుచున్నది.

రాజు

(విలోకించి) ఈ వాయువున కీ విశేషణము సరిపోయినది ఏలయన—

తెలి వలితుంపురుల్ చిలికి తేర్చిన మాధవి పాళి సోలఁగా
నలస విలాస లాస్యముల నార్చిన మొల్లకు మేనఁ తూలఁగా
వలి నునుగాలియున్ వలచు వైపును వాలు విదెంత నేర్చెనో!
వల పొకవంకఁ దూఁగఁగను పైనెన రింకొకవంక సాఁగఁగన్ 25

(పరిక్రమించి)

విదూషకుడు

ఇదిగో ! ప్రమదవనద్వారము ! ప్రవేశింపుము !

రాజు

ముందు నడువుము !

(ఇరువురు ప్రవేశము రూపింతురు)

రాజు

(త్రాసము రూపించి) వయస్య ! ఉద్యానప్రవేశము ఆపదకు ప్రతీకార మగు నని నిశ్చయించితిని. కాని - అది అన్యథా పరిణమించినది.

జ్వలిత మనోభవానల వివర్ధిత తాపభరోపశాంతికై
లలిత వనంబు నీడఁ జెఱంగఁగ నేఁ దలపోయు టింత యున్
వలియఁగఁ బాఱు వెల్లి వడివాలున మిన్నక పోవుచుండియున్
జల మెదురీఁదు పూనిక పెనంగెడు వీఁడి చందమే సుమీ 26

విదూషకుడు

ఏరీతిగనో?

రాజు

ఇది సులభేతరార్థముల కేఁకటఁ గొన్నది దుర్నివార మీ
యెద నలయించు రేఁబవలు వింతకు మున్న యధిజ్యధన్వుఁడై
మదనుఁడు; పైఁ బటీరపవమాన గళ త్పరిణామ పాండుర
చ్ఛద సహకారముల్ చిగురుసంజ విగిడ్చినఁ జెప్పనున్న దేః 27

విదూషకుడు

నీవు దుఃఖపడవలదు. అచిరకాలములో అభీష్ట సంపాదకుఁడైన అనంగుఁడే నీకు సహాయుఁడు కాఁగలఁడు.

(అని పరిక్రమింతురు)

విదూషకుడు

వసంతావతార సూచకమైన యీ ప్రమదవన మెంత యభిరామముగ నున్నదో చూడుము!

రాజు

అడుగడుగున కానవచ్చుచునే యున్నది. ఇచ్చట—

మగువల గోటివన్నె కొనమాఁగిలె గోరంట శ్యామపార్శ్వమై;
మొగ విడఁ బాతె రాగసముపోఢ మశోకము; సంభవద్రజః
స్థగితము చూతశాఖ కపిశచ్ఛవి క్రొన్ననగుత్తి వాల్చె; ని
మ్మగ మధులక్ష్మికిన్ బరువపుం దొలి వేఁకువ శేకలాతెడున్ 28

విదూషకుడు

నీలమణి శిలాఫలక సనాథమగు నీ మాధవీలతామండపము తుమ్మెదల ముమ్మరమున రాలిన పూలతో నీకొఱకే అలంకరింపఁబడినట్లున్నది. దీని ననుగ్రహింపుము!

రాజు

నీ యభిరుచి ననుసరించి.

(అని కూర్చుందురు)

విదూషకుడు

ఇప్పుడిచ్చట సుఖముగఁ గూర్చుండి యీ యెలదేవియలు నీచూడ్కులను ఎల యించి కొనుచుండ -ఆయూర్వశిమీఁది విరాళిని కొంత తీర్చికొనవచ్చును.

రాజు (నిట్టూర్చి)

పూల బరువున కొమ్మలు వ్రేల నేలమి
బోలు నారామవల్లులఁ జూచియైనఁ
జూడ్కి తనివోవదింత; తత్పుర సరోరు
హావనావలోక సంస్పృహాధీనవృత్తి 29

నేను సఫల మనోరథుఁడనగు నుపాయమును నీ వాలోచింపవలయును.

విదూషకుడు

(నవ్వి) అహల్యాకాముకుఁడైన యింద్రునకు వజ్రమెంతటి సాహాయ్యకారియో ఊర్వశీ పర్యుత్సుకుఁడవైన నీకు నేనుకూడ నంతటి సాహాయ్యకారిని. ఈవిష యమున ఇరువుర ను ఉన్మత్తులమే

రాజు

అట్లనకు -! అతిస్నేహము కార్యదర్శిగదా! ఉపాయ మాలోచింపుము.

విదూషకుడు

ఇదిగో! ఆలోచించుచున్నాను. నీ పరిదేవనములతో నా సమాధిని చెదరఁగొట్టకుము!

(ఆలోచనను సూపించును)

రాజు (నిమిత్తమును సూచించిన తనలో)

హత్తరాద నిందునెత్తమ్మి పువువాయ
దొరయు మోము చాయ సురవధూటి;
ఈ యనంగ వికృతి కేమందు? కాంక్షిత
మెదుట డాసినట్లై యెద రహించు 30

(అని ఉత్కంఠితుఁడై యుండును)

(పిమ్మట – ఆకాశయానమున ఊర్వశియు చిత్రలేఖయు ప్రవేశింతురు)

చిత్రలేఖ

సఖీ! కారణము నిర్దేశింపక మిన్నకయే యీపోవుట ఎచ్చటికి?

ఊర్వశి

(మదన వేదనను అభినయించి సలజ్జముగ)

ఊర్వశి

సఖీ! నాఁడు హేమకూట శిఖరమున లతావిటపమునందుఁ జిక్కుకొన్న నా వైజయంతిని విడిపింపుమని నేనడిగినపుడు "దృఢముగ చిక్కుపడినది విడఁదీయ శక్యముకాదు." అని - నన్ను మేలమాడి - ఇప్పుడు - "కారణము నిర్దేశింపక యీపోవుట యెచ్చటికని" యడుగుచున్నావు!

చిత్రలేఖ

ఆ రాజర్షి పురూరవసుని యొద్దకా?

ఊర్వశి

నా వ్యవసాయము లజ్జను దూరీకరించినది.

చిత్రలేఖ

సఖీ! ఆ జన - కొంత నిర్ధరించి కొనవలయును. ముందెవ్వరిని పంపితివి?

ఊర్వశి

హృదయమును.

చిత్రలేఖ

నిన్ను నియోజించుచున్న దెవ్వరు?

ఊర్వశి

మదనుఁడే.

చిత్రలేఖ

ఇటుపై నేను చెప్పవలసినది లేదు.

ఊర్వశి

అయినచో-అంతరాయములులేని మార్గమును నాకు ప్రియసఖి ఆదేశించునుగాక !

చిత్రలేఖ

సఖీ! నిర్భయవై యుండుము. భగవంతుఁడగు దేవగురుఁడు 'అపరాజిత' అను శిఖాబంధినియైన విద్య నుపదేశించి మనలను సుర వైరుల బారి పడకుండ జేసెనుగదా!

ఊర్వశి (సలజ్జముగ)

ఆ విద్యా ప్రయోగ మంత్రము నీకు గుర్తున్నగా?

చిత్రలేఖ

అంతయు హృదయ స్థితము!

(ఇరువురు భ్రమణము రూపింతురు)

చిత్రలేఖ

సఖీ! చూడుము! యమునాసంగ పావనములైన భాగీరథీ పుణ్యసలిలము ల యందు తననీడ చూచికొనుచు ప్రతిష్ఠాన నగరమునకు శిఖాభరణమువలె నున్న ఆ రాజర్షి భవనమును జేరితిమి.

ఊర్వశి

(సస్పృహముగ నవలోకించి)

స్థానాంతర గతమైన స్వర్గమనవలయును.

(విచారించి)

సఖీ! ఆ యాపన్న దయాళు వెచ్చట నుండునో!

చిత్రలేఖ

నందన వనైకదేశమువలె కనిపించుచున్న యీ ప్రమదవనములో దిగి అరయుదము

(ఇరువురును దిగుదురు)

చిత్రలేఖ

(రాజును జూచి హర్షముతో)

సఖీ! అచిరోదితుఁడైన భగవంతుఁడగు చంద్రుఁడు జ్యోత్స్నను వలె యీ రాజు నిన్ను ప్రతీక్షించుచున్నాఁడు!

ఊర్వశి

సఖీ! ప్రథమ దర్శనమునకన్న మహారాజు నేఁడువిశేషముగ ప్రియదర్శనుఁడు

చిత్రలేఖ

నిజమే! సమీపింతము రమ్ము!

ఊర్వశి

అప్పుడేకాదు. తిరస్కరిణితో పార్శ్వ పరివర్తినినై ఏకాంతమున సహచరునితో ఏమి మంతనమున నుండెనో విందును.

చిత్రలేఖ

నీ రుచి ననుసరించి.

(అని యథోక్తముగ నుందురు)

విదూషకుడు

ఓయీ! స్ఫురించినది. దుర్లభ ప్రణయినీ సమాగమోపాయము!

(రాజు మిన్నక యుండును)

ఊర్వశి

ఆ భాగ్యశాలిని యెవ్వరో! ఈయన చేత ప్రార్థ్యమానయై వినోదించునంతటిది.

చిత్రలేఖ

ధ్యానించి తెలిసికొనరాదా?

ఊర్వశి

తొందరించి తెలిసికొనుటకు భయమగుచున్నది.

విదూషకుడు

ఓయీ! దుర్లభ ప్రణయినీ సమాగమోపాయము స్ఫురించిన దనుచుంటినిగదా?

రాజు

ఏదీ చెప్పుము!

విదూషకుడు

స్వప్నసమాగమ కారిణియైన నిద్రను సేవింపుము. లేనిచో - ఆయూర్వశీ ప్రతి రూపమును చిత్రఫలకమున వ్రాసి చూచుచునుండుము.

రాజు

ఆ యీ రెండును పొసఁగునవికావు.

నాటిన శల్యమైన సుమనశ్శరవేదన రేలఁ గూర్కు, క
న్నాటఁగ స్వప్నసంగమ సుఖావహమై చను వింతమాత్రయున్
బాటిల; దింకఁ జిత్తరువుపైఁ దరళేక్షణనెంచి వ్రాయు న
చ్చోటను బాష్పమంధరత చొప్పడ కుండుట లేద; చూడ్కికిన్ 31

చిత్రలేఖ

సఖీః వింటివికదా!

ఊర్వశి

వింటిని కాని యిది చాలదు.

విదూషకుడు

నా మతి వైభవ మీ మాత్రమే.

రాజు

(నిట్టూర్పుతో)

మానవి బాళి నాయెడఁద మాఁగిలు టచ్చుర నేరమయ్యెనో!
తానొకటన్ ప్రభావ విదితస్థితి యయ్యు నవజ్ఞ చేసెనో!
ఆ నలినాక్షి మీది యడియాసలు మిన్నక పెంచి నా ధృతి
స్థానము కొల్లవోఁ గుసుమధన్వుని పూన్కి కృతార్థమయ్యెడున్ 32

చిత్రలేఖ

వింటివికదా!

ఊర్వశి

ఆక్కటా! అక్కటా! ఇట్లనుకొనుట నన్నుగుఱించియేనా? సఖీ! చిత్రలేఖా! ఎదుటపడి కనిపింపజాలను. ప్రభావ నిర్మితమైన భూర్జపత్రముతో లేఖ నొనరించి జాఱవిడిచెదను.

చిత్రలేఖ

అనుమతమే.

(ఊర్వశి లేఖవ్రాసి జాఱ విడుచును)

విదూషకుడు

అమ్మో! అమ్మో! నన్ను మ్రింగుటకే కాఁబోలున! పాముకూసము వలె నిది యేదో మీఁది మీఁదికి వచ్చుచున్నది!

రాజు

(చూచి)

ఇది పాముకూసము కాదు. భూర్జపత్రము మీది వ్రాలు!

విదూషకుడు

ఒకవేళ - అదృష్టమైన యూర్వశి నీపనవుట విని తన యనురాగ సూచక ముగ భూర్జ పత్త్రిముపై వ్రాసి వదలిన వ్రాయై యుండునేమో!

రాజు

కోరికలకు చేరలేని తావులేదు.

(తీసి చదువుకొని హర్షముతో)

స్నేహితుడా! నీయూహ ప్రసన్నమైనది!

విదూషకుడు

అందేమి వ్రాసి యున్నదో వినఁగోరుదును.

ఊర్వశి

మేలు మేలు! అయ్యా! నాగరుఁడ వవుదువు.

రాజు

వినుము (రాజు చదువును)

దేవర నా మనస్సరణి తెల్లము గామికి నంగజన్మ బా
ధావివశత్వ మొందిన విధంబిది యిట్టిద; యేను వేఁగెదన్
దేవర! నీమనస్సరణి తెల్లము గామికి పారిజాత శ
య్యా వివశాంగినై సురవనానిల దీప్తమనోభవాగ్నికిన్ 33

ఊర్వశి

ఇప్పుడేమి యనునో!

చిత్రలేఖ

మ్లాన మృణాళ నాళములను పోలియున్న యంగకములే చెప్పుచున్నవికదా!

విదూషకుడు

ఆకలి వేయుచున్నప్పుడు నాకు స్వస్తి వాచనికమువలె భాగ్యవశమున నీకీ సమాశ్వాసన కారణము లభించినది!

రాజు

దీనిని సమాశ్వాసన మనుట చాలునా?

ఇమ్మెలరన్ సమగ్రప్రణయ మింపగు నర్థము నందమర్చి ప
త్రమ్మున విన్యసింపఁగ నుదాహరణమ్మొనరించినన్నె: తా
న వమ్మదిరాయతేక్షణ యుదంచిత పక్ష్మలమైనమోము; నా
నెమ్మొగమందు వ్రేలుఁబడె: నిశ్చల లోచనయుగ్మపేయమై 34

ఊర్వశి

ఇచ్చట మన యిరువురి మతియును సమభాగము!

రాజు

చెలికాడా! వ్రేళ్ళ చెమరుపుతో అక్షరములు పొడమాసి పోవుచున్నవి. ఈ ప్రియా స్వహస్త విక్షేపమును నీహస్తమునందు ధరింపుము.

విదూషకుడు

(తీసికొని)

అయినచో - ఆయూర్వశి నీమనోరథతరువునందు కుసుమములను జూపి - ఫల నదర్శ మొనరించు నందువా?

ఊర్వశి

సఖీ! డాయుట కలఁజడి పడుచున్న హృదయమును నిలువరించి కొనులోపల- నీవు కనిపించి నాకనుమతమైన మాట అడుచుండుము.

చిత్రలేఖ

ఆరీతిగనే

(తిరస్కరిణిని తొలఁగించి రాజును సమీపించి)

జయము జయము మహారాజునకు!

రాజు

(సంభ్రమాదరములతో)

స్వాగతము! స్వాగతము!

(పార్శ్వమునఁజూచి)

కల్యాణీ!

ఆ మహానంద మిడవు నీవరుగుదెంచి
ప్రాణసఖి నెడఁబాసి మదాత్మకిపుడు
మున్నట ప్రయాగలో చూచియున్న యమున
గంగ నెడఁబాసి యొక్కెడఁ గాంచి నటుల 35

చిత్రలేఖ

తొలు దొలుత మేఘరాజియే కనిపించును. అపై విద్యుల్లత!

విదూషకుడు

ఊర్వశి యీమె కాదా? ఈమె ఆమె సహచరియా?

రాజు

ఈ యాసనమునఁ గూర్చుండుము!

చిత్రలేఖ

ఊర్వశి శిరసా ప్రణమిల్లి మహారాజునకు విన్నవించికొనుచున్నది.

రాజు

ఏమి యాజ్ఞాపించుచున్నది?

చిత్రలేఖ

"దానవుల వలన నేర్పడిన యానాటి యుపద్రవములో నాకు మహారాజే శరణమయ్యెను ఆనాఁడు నిన్ను జూచుటవలన నుదయించిన మదనునిచేత మిగుల నలయుచున్న నేను - మఱల మహారాజునకే దయనీయురాల నగుచుంటి"నని.

రాజు

చెచ్చెలీ!

తరమిడి పల్కెడీవు ప్రియదర్శన యెంత విరాళి సోలునో,
యరయవుపో: పురూరవసు నాదట పైదలిమీద నెట్టిదో!
మరు దలయించు టెర్వ్వర సమమ్మగు; నీవిట నిందుబింబ మం
దిరవు కొనంగ లీల నొలయింపుమ! వెన్నెలవోలె నచ్చరన్ 36

చిత్రలేఖ

(తిరస్కరిణిలోనున్న యూర్వశినిఁ జేరవచ్చి)

సఖీ! యిటు కదలిరమ్ము! నీకన్న నిభృతతరమై భయావహమగుచున్న నీ ప్రియతముని మదనావస్థను చూచి - అతని దూతికనై నీయొద్దకు మరలి వచ్చితిని.

(తిరస్కరిణిని తొలఁగించికొని)

ఊర్వశి

ఓసీ! అవ్యవసితురాలా! ఎంత తేలికగ నన్ను విడిచి పోయితివే!

చిత్రలేఖ (నవ్వుచు)

క్షణములోనే తెలిసికొందుము! ఎవరు ఎవరిని ఎంత శీఘ్రముగ విడువ నున్నారో! ఇప్పుడు - రూపమును వెలువరింపుము!

(ఊర్వశి సాధ్వసముతో రాజును చేరవచ్చి సవ్రీడముగ)

జయము జయము! మహారాజునకు!

రాజు

(హర్షముతో)

సుందరీ!

నే జయించితినే కద! నిఖిలజగతి
నీముఖమ్మున 'జయ' యని నేఁడు తొలుత

ఆ సహస్రాక్షు వెలిగ ననన్య పురుష
భాజనంబైన శబ్దంబు బాహిరిలుట! 37

(హస్తమున గ్రహించి ఆసనమునఁ గూర్చుండ జేయును)

విదూషకుడు

నీ రాజ్యము నందలి స్థితి యేరీతిదో! ప్రియవయస్యుఁడైన బ్రాహ్మణునకు వందన మేలేదు.

(ఊర్వశి సస్మితముగ ప్రణమిల్లును)

విదూషకుడు

నీకు స్వస్తి యగుత

(తెరలో)

చిత్రలేఖా! ఊర్వశిని తొందరింపుము.-

భరతుం డెయ్యది కూర్చె ముందటను సంబద్ధాప్సరః పాత్రమున్
పరముండష్ట రసానలంబముగ; తద్భవ్యాభినేయార్థమున్
మరుదాస్థాని సలోకపాలము సుధర్మాభర్మ పీఠస్థుఁడై
సురనాథుండు దిదృక్ష సేఁచునిదె! విచ్చుందమ్మి పూఁదోటయై 38

(అందఱు విందురు. ఊర్వశి విషాదము రూపించును)

చిత్రలేఖ

దేవదూత వచనము వింటివికదా! ఇంక మహారాజు ననుమతింపఁజేయుము!

ఊర్వశి

(నిట్టూర్చి)

నాకు మాటలులేవు.

చిత్రలేఖ

మహారాజ! ఊర్వశి విన్నవించుకొనుచున్నది - "నేను పరాధీనను మహారాజు నన్నుజ్ఞతో దేవాపరాధమునుండి తొలఁగ నెంచుచుంటి" నని

రాజు

(ఎట్లో మాట నిలువరించుకొని)

నేను మీ ప్రభునియోగమున కడ్డునిలుచువాఁడను కాను. అయినను - ఈ దెస తలంపు మాత్రము నిలుపునది.

(ఊర్వశి వియోగ దుఃఖము రూపించి రాజువంకఁ జూచుచు సఖీసహితముగ)

(నిష్క్రమించును)

రాజు

(నిట్టూర్పుతో)

ఇంక - కన్నులుండిననేమి? లేకున్న నేమి?

విదూషకుడు

(లేఖ - చూపఁబోయి)

ఇదిగో! భూర్జ-

(అర్ధోక్తముగఁదనలో)

ఎంత ప్రమాదము జరిగినది! ఆయూర్వశికి కన్నులప్పగించి - చేతిలోని భూర్జపత్త్రము జాఱిపోవుట కూడ నెఱుఁగక యున్నాను!

రాజు

ఏమో చెప్పఁబోయితివి!

విదూషకుడు

వయస్య! నేను చెప్పఁబోయినదిది - నీవు శరీరత్యాగము చేయవలదు. ఆ యూర్వశి నీయందు దృఢముగ నిబద్ధ భావయైయున్నది, ఆమె యిచ్చటినుండి వెళ్ళి యీ యనుబంధమును శిథిలీకరింపదు.

రాజు

నామనస్సులో కూడ నిదియే యున్నది. ఆమె వెళ్ళునపుడు -

వేలుపుతేని యానతి చెవింబడినంతన విన్నఁ బాటునన్
తూలిన మేనితో చెలియతో పయనంబయి మేని మేలుకన్
జాలనిదౌట నిందు స్వవశంబగు డెందము డించిపోవు నే
మో లలితాంగి! నా, నిడుదయూర్పెసఁగెన్ స్తనకంపలక్ష్యమై 39

విదూషకుడు

(తనలో)

నాగుండె దడదడలాడు చున్నది. ఏ క్షణమున ఆభూర్జపత్త్రము మాట ఎత్తునో! అని -

రాజు

వయస్య! ఉన్మనసమైన నాయాత్మకు నిప్పు డేమియూఁటుట మిగిలియున్నది?

(తలంచికొని)

ఆఁ భూర్జ పత్త్రము నందిమ్ము!

విదూషకుడు

(అంతట కలయఁజూచి)

హా! కనిపించుటలేదే? ఓయీ! ఆభూర్జ పత్త్రము దివ్యముగదా! ఊర్వశి త్రోవనే వెళ్ళిపోయినది.

రాజు

(కోపముతో)

బ్రాహ్మణునకు సర్వత్ర ఏమరుపాటే!! మఱి వెదకుము!

విదూషకుడు (లేచి)

ఇదిగో! యిచ్చట నుండును లేక ఇచ్చటనైన నుండును.

(అని వెదకుట రూపించును)

(పిమ్మట - ఔశీనరియు చేటియు పరివారము ప్రవేశింతురు.)

ఔశీనరి

ఓసీ! నిపుణికా! ఆర్యపుత్రులు మాణవకునితో - ఈ లతాగృహమునందు ప్రవేశించుచు నీకుఁ గనఁబడినది నిజమా?

నిపుణిక

ఎన్నఁడైనను దేనికి అసత్యము విన్నవించి యెఱుఁగుదునా?

ఔశీనరి

నీవు చెప్పినది నిజమో కాదో యీ విటపముమాటున నిలిచి వీరి మాటలు విని నిశ్చయింతును.

నిపుణిక

భట్టిని చిత్తము.

ఔశీనరి

(పరిక్రమించి - ముందునకుఁ జూచి)

నిపుణికా! యీపత్రమేమిటి? నవ చీవరమువలె దక్షిణపుగాలికి యీవైపే కొట్టికొని వచ్చుచున్నది.

నిపుణిక

(పొల్చికొని)

పొరలికలలో ఏవో అక్షరములు కనిపించుచున్నవి. భట్టినీ! యిది భూర్జ పత్రిమే. అవురా! యిది దేవి యందియ కొణిగెకే తగుల్కొన్నది. దీనిని చదువుట ఎట్లు?

ఔశీనరి

ముందు నీవిది చూడుము. వినదగినచో పిమ్మట నేను విందును.

నిపుణిక

(చదివికొని)

దేవీ! ఆ యీ ప్రవాదము విజృంభించుచున్నది. ఇది భట్టారకు నుద్దేశించి యూర్వశీ విలిఖితాక్షరమైన కావ్యబంధమై యుండును. ఆర్యమాణవకుని యేమరుపాటు వలన మన చేతులలోఁ బడినది!

ఔశీనరి

అందలి విషయము తెలిసికొనుము.

(చేటి - 'దేవర నామసస్మరణి' చదువును)

ఔశీనరి

ఈ కానుకతోనే ఆ యప్సరః కాముకుని దర్శింతము.

(అని - యిరువురు పరిజన సహితముగ లతాగృహమునకు నడచుదురు)

విదూషకుడు

వయస్య! ప్రమదవన సమీపములో క్రీడాపర్వత ప్రాంతమున - ఇదియేదో గాలికి కొట్టుకొని వచ్చుచున్నది.

రాజు

(లేచి)

స్వామీ! వసంతసఖ! మలయానిలా!

వాసంతీ సురభి ప్రసూనజ రజోవ్యాసంగమే । మద్వ్యథా-
శ్వాసాయాత సఖీ స్పృహ స్తహరణ ప్రారంభ? మయ్యంజనా
వ్యాసక్తుండగు నీవెఱుంగవె! స్మరవ్యాపన్ను లేవంవిధా-
శా సంధుక్షిత జీవు లాయెడల నీసయ్యాటమేలే ప్రభూ! 40

నిపుణిక

భట్టినీ! యీ భూర్జపత్రాన్వేషణమే నడుచుచున్నది.

ఔశీనరి

పరికించుచున్నాను.

విదూషకుడు

ఓయీ! వన్నెదగ్గిన కేసరములతో - ఈ నెమలిపురి నన్ను కన్నుగప్పినది!

రాజు

ఎల్లవిధముల హతుండనైతిని.

ఔశీనరి

(త్వరగా చేరవచ్చి)

ఆర్యపుత్ర! ఆవేగము వలదు! ఆ భూర్జపత్ర మిదియే!

రాజు

(ససంభ్రమముగ - తనలో)

ఔరా! యీమె ఔశీనరి!

(ప్రకాశముగ)

ఔశీనరి

దేవీ! స్వాగతము!

రాజు

ఇప్పుడిది దురాగతమే యైనది.

(జనాంతికముగ)

వయస్య! యిప్పుడు ప్రతి విధానమేమి ?

విదూషకుడు

సొత్తుతో పట్టుపడిన పిమ్మట దొంగ యేమి చెప్పుకొనును?

రాజు

(అపవారించి)

మూఢుడా! ఇది పరిహాసమునకు వేళకాదు (ప్రకాశముగ) దేవీ! నేను వెదకునది - ఇదికాదు అది కార్యాలోచనపత్రము ! ఈ ప్రయత్న మంతయు దానికోసమే.

ఔశీనరి

చక్కగా నతికినది. ఆత్మసౌభాగ్య ప్రచ్ఛాదనము!

విదూషకుడు

భవతీ! ఈయనకు త్వరగా భోజనము తెప్పింపుము. పైత్యముపశమించి స్వస్థత చేకూరగలదు

ఔశీనరి

చూడవే! నిపుణికా! బ్రాహ్మణుడు తన వయస్యున కెంత చక్కగా అంగ రక్ష పెట్టుచున్నాడో!

విదూషకుడు

చూడు మఱి - చిత్రభోజనవార్త చేతనే వయస్యుఁడు స్తిమిత పడినాఁడు.

రాజు

మూర్ఖుఁడా! బలవంతముగ నన్నపరాధినిఁ జేయుచున్నావు.

ఔశీనరి

నీ యపరాధమేమియునులేదు కంటికి వెక్కసముగ నీయెదుట నిలుచుట నాదే యపరాధము. ఇచ్చటినుండి పోవుచున్నాను.

(అని కోపము రూపించి బయలుదేరును)

రాజు

(అనుసరించుచు)

అయోఁ బొమ్మ నేన యపరాధి నింతేని?
కలఁక దేఱ మింక నలుక విడుము
చిత్త మెరియు వేళ సేవ్యుల కోపమైనఁ
దప్పెయగున కాదె? దాసుఁ యెడ! 41

(పాదములపైఁ బడును)

ఔశీనరి

నేను బేలనై యీ యనునయమును పాటింపరాదు. ఇది - దాక్షిణ్య కృతమైన ప్రశ్చాత్తాపమైనచో వెఱతును.

(అని రాజును విడిచి సపరివారముగ నిష్క్రమించును)

విదూషకుడు

వర్షానదివలె అప్రసన్నయై దేవి తరలిపోయినది. ఇంక నీవు లెమ్ము!

రాజు

(లేచి)

ఆమె యప్రసన్నత అహేతుకము కాదు. చూడుము —

ఓ పంకజాలవి కూర్మి యొండు వెలిగా నొండొక్క-రీతిన్ ప్రియా
లాపంబుల్ శతమైన సాంత్వనము బాలా స్వాంత ఖేదాపహ
వ్యాపార ప్రవణమ్ముగాదు; మది కింపన్ జాలునే? యెమ్మెయిన్
బైపై వన్నెల జాలు, రత్న నికషప్రజ్ఞా సమజ్ఞాత్మకున్ ॥ (42)

విదూషకుడు

ఇప్పటి కిదియే అనుకూలము. అక్షిదుఃఖితుఁడు - ఎదుటి దీపశిఖను సహింప లేఁడు.

రాజు

ఇట్లనకుము. ఊర్వశీబద్ధ హృదయుఁడనైనను దేవియందలి గౌరవము గౌరవమే మఱి - ఈ పణిపాతతిరస్కృతి వలననే ఆమెయందు ధైర్యము నవలంబించుచున్నాను.

విదూషకుఁడు

నీ ధైర్య మాట యట్లు దపమ్ము ; ఆఁకలితో నాకు గ్రుడ్లుమీఁదికి వచ్చుచున్నవి. బ్రాహ్మణుని జీవమును నిలుపుము. ఇది-స్నాన భోజనములకు వేళకదా !

రాజు

(ఊర్ధ్వముగ నవలోకించి)

ఏమీ ! పగలు సగము కడచినదే ! ఇందుకనియే కాఁబోలును —

సెగకుఁ దాళని నెమ్మి చెమ్మ లూజెడు మావి
మూలాలవాలంబు నోలగించె
మొగఁ దొల్చి గంట్ల నిమ్ముగఁ దూఱె నళి
కర్ణికార కోరక గర్భవారము లను
సంతప్త పాథః ప్రచారా సహంబైన
కారండవము మాటె తీరనళిని
కేళీ గృహ ద్వారకీలిత పంజర
స్థాయి కీరంబు వాచఅచెఁ గెరలి

పరిలఘు తుషార వాః పూర పారణంబు
తేర నంతర్భవన పరిచారికలను
దాఁగి గూళ్లల వలభీ వితాన మెడసి
కులుకు చెలుఁగుల సొద మాలెఁ గలరవముల ॥ (43)

(అందఱు నిష్క్రమింతురు)

ఇది ద్వితీయాంకము

తృతీయాంకము

(పిమ్మట - భరతముని శిష్యులు ప్రవేశింతురు)

మొదటి

సఖా ! పైలవ! అగ్నిశరణమునుండి మహేంద్రమందిరమునకుఁబోవునపుడు- ఉపాధ్యాయులు నిన్ను ఆసనగ్రాహిగ స్వీకరించి-నన్నిచ్చటనే అగ్నిశరణ సంరక్షణార్థమై నిలిపిరి. అందుకని యడుగుచున్నాను- గురుని రూపక ప్రయోగముచేత దివ్యపరిషత్తు ఆనందించినదా - లేదా ?

పైలవుఁడు

గాలవ ! ఆనందించెనో - లేదో ! సరస్వతీ ప్రణీతమైన ఆ లక్ష్మీస్వయంవరమునందు-ఆ యారసాంతరములలో ఊర్వశి యున్మత్తురాలై యుండెను. మఱి-యేమన-

గాలవుఁడు

నీ వాక్యశేషము-ఏదో దోషమును సూచించునది వలెనున్నది.

పైలవుఁడు

ఆమె నుండి ప్రమాదవశమున మాట తొట్రిలినది.

గాలవుఁడు

ఏ రీతిగ-

పైలవుఁడు

లక్ష్మి భూమికలోనున్న యూర్వశితో-వారుణీభూమికలో నున్న మేనక యిట్లన్నది- "సఖీ ! త్రైలోక్య పురుషులును కేశవసహితులైన లోకపాలురును వచ్చియున్నారు ఇందెవ్వనియందు నీహృదయాభినివేశ" మని-

గాలవుఁడు

ఆ పైన ?

పైలవుఁడు

"పురుషోత్తమునియందు" అని పలుకవలసియుండగ-ఆమె నోటినుండి పురూరవసునియందు"అని సరస్వతి వెలువడినది.

గాలవుఁడు

బుద్ధీంద్రియములు భవితవ్యతకు పూర్వరంగమును కల్పించుచుండును. ముని యామెపై మిక్కిలి కోపించెనా ?

పైలవుఁడు

ఉపాధ్యాయులు శపించిరి. తిరిగి మహేంద్రుఁ డనుగ్రహించెను.

గాలవుఁడు

ఏరీతిగ ?

నా యుపదేశము నీచే వ్యతిక్రమింపఁబడినదికావున నీకిఁక స్వర్గమునందు స్థానము కలుగఁబోదని యుపాధ్యాయులనుండి శాపము :—

అప్పుడు - లజ్జావనతముఖియై యున్న యూర్వశినిఁ జూచి మహేంద్రుఁడిట్లనెను- "ఎవ్వనియందు నీవు నిబద్ధభావవై యుంటివో నాకు రణసహాయుడైన ఆ రాజర్షికి నేను ప్రియ మొనరింప వలసియున్నది. కావున నీవు యథాభిలషితముగ - పరిదృష్టసంతానుఁడగునంతవఱకును ఆ పురూరవసుని సేవింపుము" అని -

గాలవుఁడు

పురుష విశేష విత్తముఁడగు పురందరునికిది తగియున్నది.

శైలవుఁడు

(సూర్యునవలోకించి)

కథాప్రసంగముచేత స్నానవేళ దాటిపోయినది. కావున రమ్ము! ఉపాధ్యాయులకు పార్శ్వపరివర్తుల మయ్యెదము!

(అని - నిష్క్రమింతురు)

ఇది మిశ్రవిష్కంభకము

(పిమ్మట - కంచుకి ప్రవేశించును)

కంచుకి

కాలమునందు సంపదలకై జతనంబయి ప్రాయమింత కై
వ్రాలిన పిమ్మటన్ సుతులు ప్రాపయి గేస్తు సుఖింపనెందు
య్యాలరి బ్రహ్మ మానొసట నద్దిన వ్రాలివి! జీవితాంత కా
రాలయమైన యీడిగము. నంగన లందధికార మిస్పిరో! 44

(పరిక్రమించి)

నియమ స్థితురాలైన కాశీరాజపుత్త్రి యిట్లాదేశించినది—

"వ్రతార్థమై కోపము విడిచి యింతకు మునుపే నిపుణికాముఖమున మహారాజు నభ్యర్థించి యుంటిని. ఆ మనవియే నామాటగా మహారాజునకు విన్నవింపు" మని-

ఇప్పుడు - మహారాజునకు సంధ్యాజపోపాసన సమయముకావచ్చినది. పోయి దర్శించెదను.

(పరిక్రమించి —చూచి)

ఈ రాచనగరుల యందలి దినాంతవృత్తాంత మెంత రమణీయము !

మలఁచి నట్టులె వ్రేలె మణియష్టులను విశా
        నిద్రాలసములైన నెమ్మిగములు
జాలోద్గమ ధూపజాలంబు వలభుల
        పల్లటీలను శంక పాదుకొలిపె
పరిచిత దివసాంత పరివాదినీ గీతి
        చక్రవాకోత్కంఠ సందడించె
ఆరామ శాలా గృహాంతరమ్ముల కీర
        సారస శారికల్ సద్దుమణఁగె

విశ్రుతాచార శుద్ధాంత వృద్ధజనము
సాంధ్య మంగళదీపికా సమితి నేర్చి
కలిత సుమబలి రమ్యశృంగాటకములఁ
జేర్చుచుండిరి వరుస నర్చిష్మతులను ॥ (45)

(నేపథ్యాభిముఖముగ నవలోకించి)

ఓహో! మహారాజులిటు వైపేవచ్చుచున్నారు !

పరివృత పరిజనవనితా
కరతల విన్యస్త దీపికలఁ గడు వెలిఁగెన్
ధరణిపతి కర్ణికార
స్ఫురిత తట సపక్షశైల మోహనగతియై ॥ (46)

ఆలోకన మార్గమున నిలచి యిప్పుడీయనను ప్రతీక్షింతును.

(పిమ్మట యథానిర్దిష్టముగ రాజు, విదూషకుఁడు, పరిజనము ప్రవేశింతురు)

రాజు

(తనలో)

ధృతి పృథ్వీబహుకార్య చింతన కళాధీనైక వృత్తమ్మునన్
గతియించెన్ దివసం బలబ్ధహృదయోత్కంఠాభరాల కాంతియై
మతి నేకాంతసుదుస్సహంబిదె త్రియామావేళ యేతెంచె; నె
ట్లతి గాహింపఁగవచ్చు దీని? నవినోదాలయామ యామమ్ములన్॥
(47)

కంచుకి

(సమీపించి)

జయము జయము మహారాజునకు!

దేవి విన్నవించుచున్నది -

''మణి హర్మ్య పరిసరప్రదేశము నుండి చంద్రదర్శనము రమణీయము
అచ్చటికి విచ్చేసిన ప్రభువులతోఁ గలసి రోహిణీ సంయోగ మగునంతవఱకు
ప్రతీక్షింపఁ గోరుచుంటి' నని -

రాజు

"నీ యిష్టానుసార" మని దేవికి విన్నవింపుము.

కంచుకి

దేవర యానతి.

రాజు

వయస్య! దేవి యిప్పటి యెత్తికోలు పరమార్థముగ వ్రతనిమిత్తమే యందువా?

విదూషకుడు

పశ్చాత్తప్తయై యీవ్రతము నెపమిడి తాను నీయెడ నొనరించిన ప్రణిపాత లంఘనమును తొలఁగికొనఁ గోరుచున్నదని యూహించుచున్నాను.

రాజు

నీవు చెప్పినది సహేతుకము. ఏమన -

దోసిలి యొగ్గియున్ జరణతోయజ సన్నిధియందు మ్రొగ్గియున్
వేసర కెన్నిభంగులను వేడిన, కాంతల నీసు పెంపునన్
ద్రోసి యదల్చియేగి పయి, తోయరుహాక్షులు లీనకోప సం
ధ్యాసమయ ప్రతపాతరళితాంతర గూఢ విముగ్ధ వర్తనల్ 48

కావున - మణిహర్మ్య పృష్ఠమునకు మార్గమాదేశింపుము.

విదూషకుడు

ఈ దారిని రమ్ము! గంగా తరంగశిశిరమగు నీ స్ఫటిక మణి శిలా సోపాన మార్గమున రజనీముఖ రమణీయమైన యీ మణిహర్మ్యపృష్ఠము నారోహింపుము.

(రాజు ఆరోహించును. అందఱు సోపానారోహణము రూపింతురు)

విదూషకుడు

చీఁకటి విరిసి యెఱ్ఱఁబాఱుచున్న తూఱుపుమొగము చూడఁగా, చంద్రోదయము చేరువలో నున్నట్లు తోఁచుచున్నది.

రాజు

నీ తలంపు సరి -

ఉదయోన్ముఖ సితకిరణ
ప్రథమఘృణి దళత్తమః ప్రబంధము ప్రాచీ
వదనము సంయమితాలక
ముదితాననకాంతి నయన మోహనమయ్యెన్ 49

విదూషకుడు

అహహ! అడుగో! మోదకఖండమువలె ఓషధీశ్వరుఁడు ఉదయించుచున్నాఁడు!

రాజు

(సస్మితముగ)

ఔదరికునకు ఎల్లయెడల భోజ్యమే గోచరించుచుండును!

(దోసిలియొగ్గి ప్రణమిల్లి)

స్వామీ! నక్షత్రనాథ!

ప్రాపిత సౌరరశ్మికిని పర్వతములన్ మఖి సత్క్రియార్థమై
తీఁపగు బువ్వకున్ సురపితృ ప్రకరోదిత జాఠరాగ్నికిన్
మాఁపుల మూఁగు టిర్లమొగ నాటు కటారికి శంభుమౌళిపై
కాఁపురమున్న దేవరకుఁ గల్వలతేనికి జోత నీకిదే! 50

విదూషకుడు

ఓయీ! ద్విజ సంక్రామితాక్షరములతో నీ పితామహుఁడు నీ కభ్యనుజ్ఞ నిచ్చినాఁడు. నీవు - ఆసన గతుఁడ వైనచో నేనును సుఖాసీనుఁడ నయ్యెదను.

రాజు

(విదూషకుని మాట మన్నించి కూర్చుండి పరిజనమును జూచి)

వెన్నెల వెల్లివిరియుచుండగా - ఈ దీపికల పునరుక్తి యేల? మీరు విశ్రమింపుఁడు!

పరిజనము

దేవర యానతి!

(నిష్క్రమింతురు)

రాజు

(చంద్రునిఁ జూచి)

వయస్య! యింకొక ముహూర్తము పిమ్మటగాని దేవి యిచ్చటికి రాదు. కావున-ఏకాంతమున నా యవస్థ చెప్పెదను.

విదూషకుఁడు

ఆమె కానరాదు కాని, ఆమె యట్టి యనురాగమును చూచి యాశాబంధముతో నీవు కొంత నిలువరించి కొనవచ్చును.

రాజు

నీవు చెప్పినది నిజమే కాని నామనోఽభితాపము బలీయముగ నున్నది.

అంకిలి లేక పాఱు నదియై యొకచో విషమోపలస్థలీ
సంకట రుద్ధ వేగమగు జాలు విధంబున; నంతరాయ, మే
ణాంకముఖీ సమాగమము నందొకఁ, దేర్పడినంతఁ. జిత్తజా
తంకము తొంటిమేలకు శతప్రమితంబయి క్రమ్ముదెంచెడున్॥
(51)

విదూషకుఁడు

విరహ పరిణామములగు నీ యంగకములకాంతి యినుమడించుచున్న కొలఁది-అప్సరస్సమాగమము నీకు చేరువ యగుచున్నట్లు నాకు తోఁచుచున్నది.

రాజు

(నిమిత్తమును సూచించి)

అవధి యెఱుఁగని యాయల్లకాబ్ధిమునుఁగఁ
దేపతేపకు నాశానులాపములను
స్నిగ్ధమతి ! నిన్నుబోలె దక్షిణము నన్ను
బాహు వూరార్చుచున్నది స్పందనముల ॥ (52)

(రాజు ప్రత్యాశతో నుండును)

(పిమ్మట—ఆకాశయానమున – అభిసారికావేషమున – ఊర్వశి యును,

చిత్రలేఖయు ప్రవేశింతురు)

ఊర్వశి

సఖీ ! ముత్యములుకూర్చిన నీలాంశుకముతోడి నా యీ అభిసారికావేషము నీకు నచ్చినదా ?

చిత్రలేఖ

ఎంత నచ్చినదో చెప్పుటకు నాకు మాటలు లేవు. ఆ పురూరవసుఁడ నగుదునా ! అనిపించుచున్నది.

ఊర్వశి

సఖీ ! నేను ఓపలేని స్థితిలో నున్నాను. నీ వాతనిని శీఘ్రముగఁ గొనితెమ్మ! లేక– ఆ సుభగుని వసతికి నన్నైనను గొనిపొమ్ము!

చిత్రలేఖ

ఇదిగో ! యామినీ యమునయందు ప్రతిబింబితమైన కైలాసశిఖరమువలె నున్న నీ ప్రియతముని వసతికి రానే వచ్చితిమి.

ఊర్వశి

అయినచో-ఆ నా హృదయచోరుఁడు-ఎచ్చటనేమి చేయుచుండెనో ప్రభావమున-అరసి తెలిసికొనుము.

చిత్రలేఖ

(తనలో) కానిమ్ము : యిప్పుడీమెతో నించుక వినోదించెదను.

(ప్రకాశముగ) సఖీ! ఉపభోగక్షమమైన వెన్నెలబయల మనోరథలబ్ధమైన ప్రియా సమాగమసుఖము నందు నిమగ్నుఁడై యున్నాఁడు !

ఊర్వశి

పొమ్మ ! నాహృదయము విశ్వసింపదు! సఖీ ; చిత్రా : హృదయములో నేదో పెట్టుకొని మిన్నక మాటాడుచున్నావు. ప్రియసమాగమమునకు ముందే నా హృదయ మాతనిచేత నపహృతమైనది.

చిత్రలేఖ

ఇడుగో ! మణిహర్మ్య ప్రాసాదముపై వయస్యమాత్రసహాయుఁడైన రాజర్షి ! సమీపింతము రమ్ము !

(ఇద్దఱు నవతరింతురు)

రాజు

వయస్య : రజనితోపాటు మనోభవ వ్యథయు పెరుగుచున్నది.

ఊర్వశి

అపరిస్ఫుటార్థమైన యీమాటతో నాహృదయ మొక్కపారిగ జల్లుమనుచున్నది. సంశయచ్ఛేద మగునంతవఱకును అంతర్హితలమై యీయన యాలాపమును విందము :

చిత్రలేఖ

నీ యిష్టము.

విదూషకుఁడు

అమృత గర్భములైన యీ చంద్రపాదములను సేవింపుము!

రాజు

ఇట్టి వానితో-ఈ యాంతక ముపశమించునది కాదు. చూడుము-

అలరుల శయ్యతీర్పదు హిమాంశుమరీచులు నార్పవోర్పవా
మలయజ చర్చలన్ మస్పృణమౌక్తిక జాలములైనఁ జాలవున్
వలఁతి తలంప నచ్చరయొ ! నా వలకాఁక నడంప నొక్కమై
నలువుగ నెప్పు దేకతమునన్ జెలిఁగూర్చిన యాసుపోకయో !(53)

ఊర్వశి

హృదయమా ! నన్ను విడిచి యిచ్చట లగ్నమైనందుకు నీ కిప్పుడు ఫలము లభించినది

విదూషకుఁడు

అవును-శిఖరిణియును రసాలమును లభింపని యపుడదియే యాలోచించుచుఁ గొంత యూఅట తెచ్చికొనుచుందును.

రాజు

ఇవి నీకు దొరకనివి కావు

విదూషకుఁడు

నీవును ఆమెను అచిరకాలములో పొందఁగలవు.

రాజు

సఖుఁడా ; యిట్లు తలంతును-

చిత్రలేఖ

ఓ యసంతుష్టురాలా ; వినుము.

రాజు

కుదులుగా నల్లయెడ రథక్షోభవశత
నువిద బుజమీ బుజమ్మున నొరసికొనియె;
ఈ యొడలికెల్ల నిది భాగధేయశాలి
మిగులు మేనెల్ల భారమ్ము మేదినికివి (54)

ఊర్వశి

ఇటుపైనకూడ నాలస్యము చేయుదునా ?

(శీఘ్రముగఁజేరవచ్చి)

సఖీ ; చిత్రలేఖా ; ఎదురుగ నేను నిలిచియున్నను మహారాజు ఉదాసీనుఁడై యున్నాఁడు !

చిత్రలేఖ

(సస్మితముగ)

అతి త్వరితురాలా ; తిరస్కరిణిని ఉపసంహరింపవైతివి !

(నేపథ్యమునందు)

భట్టినీ ! ఇటు ఇటు !

(అందఱు చెవియొగ్గుదురు. ఊర్వశి సఖితో సహ విషణ్ణ యగును.)

విదూషకుఁడు

ఓయీ ; దేవి దగ్గఱకు వచ్చినది. ఇంక ముద్రితవదనుఁడవై యుండుము.

రాజు

నీవును వైఖరి మార్చియుండుము.

ఊర్వశి

సఖీ ; యిప్పుడు కర్తవ్యమేమి?

చిత్రలేఖ

ఆవేగము వలదు. నీవు తిరస్కరిణిలోనే యున్నావు. ఈ రాజమహిషి నియమవేషములో నున్నది. ఇచ్చట తడవు నిలువదు.

(పిమ్మట పూజాద్రవ్యపాణులైన పరిజనముతో దేవి ప్రవేశించును)

ఔశీనరి

(చంద్రునిఁ జూచి)

రోహిణీ యోగమున భగవంతుఁడగు మృగలాంఛనుఁడు మిగుల ప్రకాశించుచున్నాఁడు.

చేటి

భర్తృనీసహితుఁడైన మహారాజునకు విశేషరమణీయత కల్గనున్న కలుఁగఁ బోవును.

(అని పరిక్రమింతూరు)

విదూషకుడు

ఓహో! దేవి నా కన్నుల కిపుడు చల్లగా కనిపించుచున్నది స్వస్తివాచనికము నిచ్చుననియో! లేక - యీ చంద్రవ్రతమను నెపమున నీపై నలుక విడిచి నందుననో!

రాజు

(సస్మితముగ)

రెండును సంభవమే. అయినను - నీవన్న చివరిమాటయే నాకు నిజమనిపించు చున్నది. ఏలయన -

తెలి వలిపెంబు దాల్చి పరిదీపిత మంగళమాత్ర భూషయై
యలకలయందు పావన శతాంకుర పల్లవముల్ నటింప నే
స లలాకు పాపటన్ వ్రతదశా ప్రతిపన్న వినీతభావ పే
శలతనుయష్టి నాయెడఁ బ్రసన్నత కాంచిన లీల దోఁచెడున్ 55

ఔశీనరి

ఆర్యపుత్రులకు జయము జయము!

పరిజనము

దేవరకు జయము జయము!

విదూషకుడు

నీకు స్వస్తియగుత!

రాజు

దేవికి స్వాగతము!

(ఆమెను హస్తమున గ్రహించి కూర్చుండ చేయును)

ఊర్వశి

'దేవి' యని పిలువబడుట కీమె యెంత తగియున్నది! ఓజస్వితాలక్షణము నందు శచీదేవి కేమాత్రము తీసిపోదు.

చిత్రలేఖ

మేలు! అసూయకు దవ్వుగ నిలిచి పలికితివి.

ఔశీనరి

ఆర్యపుత్త్రులను పురస్కరించికొని నేను నిర్వర్తింపవలసిన వ్రత విశేష మిది! ఒకముహూర్త మాత్ర మీ యుపరోధము సహింపఁగోరుదును.

రాజు

ఇట్లనవలదు. ఇది యనుగ్రహమే. ఉపరోధముకాదు.

విదూషకుడు

స్వస్తివాచనికములతో నిట్టి యుపరోధము పలుమారులు నీకు కలుగుచుండ వలయును.

రాజు

దేవి పూనిన యీవ్రతము పేరేమి?

ఔశీనరి

(నిపుణికవంకఁ జూచును)

నిపుణిక

ప్రభూ! 'ప్రియ ప్రసాదన' మందురు.

రాజు

(దేవిని జూచి)

ఇదియే యైనచో-

ఇమ్మాడ్కి వ్రతము గైకొని
నెమ్మే నలయింపనగునె! నీదగు సౌము
ఖ్య మ్మెదురుచూచు కొలఁదుల
నిమ్మెయి దాసులను దెలుపనేలా? బాలా! 56

ఊర్వశి

(సవైలక్ష్యస్మితముగ)

ఈమె యందీయన కెంతటి బహుమానము!

చిత్రలేఖ

ఓసి ముద్దలారా! వలపు వేఱొకయెడనున్న నాగరులకు భార్యలయందు దాక్షిణ్య మధికమగుచుండును.

ఔశీనరి

ఆర్యపుత్త్రి లీమాత్రము మాటాడుచుండుట యీ వ్రతప్రభావము వలననే!

విదూషకుడు

నీవు మిన్నకుండుము. సుభాషితమును కాదనరాదు.

ఔశీనరి

దారికలార! పూజాద్రవ్యము లందియిండు: మణిహర్మ్యముపై ప్రాలిన యి చంద్రపాదముల నర్చించెదను.

పరిజనము

దేవి యానతి ! ఇవిగో ! పూజాద్రవ్యములు !

ఔశీనరి

(పుష్పాదులతో చంద్రపాదము లర్చించి)

ఓసి ! కానితెండు! ఈ పూజాద్రవ్యములతోను ఉండ్రాళ్ళతోను ఆర్యమాణవకుని, కంచుకిని సంభావింపుడు.

పరిజనము

దేవి యానతి ! ఆర్య మాణవక ! యీ స్వస్తి వాచనికము నీది.

విదూషకుడు

(వాయనపు తళ్ళెర మందికొని)

దేవికి స్వస్తియగుగాక ! యీ వ్రతము బహుఫలమగునుగాక!

చేటి

ఆర్య ! కంచుకీ ! యిదినిది.

కంచుకి

దేవికి స్వస్తియగుత !

ఔశీనరి

ఆర్యపుత్త్ర ! ఒకసారియిటు —

రాజు

ఇదిగో ! వచ్చితిని.

ఔశీనరి

(రాజునకు పూజను రూపించి ప్రాంజలియై ప్రణమిల్లి)

రోహిణీ మృగలాంఛనమైన యీ దేవతామిథునము సాక్షిగా నేను ఆర్యపుత్త్రులను ప్రసన్నులను చేసికొనుచున్నాను. నేడు మొదలుకొని ఏ స్త్రీని ఆర్యపుత్త్రుడు కోరునో, ఏ స్త్రీ ఆర్యపుత్త్రుని కోరునో ఆమెతోఁ గలసి అప్రతిబంధముగ వర్తింపనగును.

ఊర్వశి

అమ్మో ! యీమె యింకేమి యనునో యనుకొంటిని. నాహృదయ మిప్పటికిఁ గుదుటపడినది.

చిత్రలేఖ

సఖీ! మహాప్రభావయైన పతివ్రతచేత నభ్యనుజ్ఞాతమైన నీ ప్రియసమాగమ మింక నిరంతరాయము కాఁగలదు.

విదూషకుఁడు

(అపవారించి) చేతివల త్రెంచికొని మీను దూటికొనిపోఁగా - జాలరి- "ఓమత్స్యమా! యథేచ్ఛముగఁబొమ్ము! నాకు పుణ్యము దక్కఁగలదు" అని సమాధానపడును. (ప్రకాశముగ) భవతీ! ఈయన ఆ మాదిరి ప్రియుఁ డన్నమాట ?

ఔశీనరి

ఓయి విచారవిహీనుఁడా! స్వ సుఖత్యాగ మొనరించి యార్యపుత్త్రుని సుఖమే నేను కోరుకొనుచుంటిని. దీనినిబట్టి తెలిసికొనుము. ప్రియుఁడగునో-కాదో!

రాజు

ఇచ్చపెకె కాదు; నీవు నన్నితరులకును
దాసునిగనైనఁజేయుంగ దక్ష వయిన
నెట్టివానిగ నన్ను శంకింతువో! మ
ఱట్టివాఁడనుగానె! భీతాంతరంగ! (57)

ఔశీనరి

అవుదువో, కావో, 'ప్రియప్రసాదనము' యథానిర్దిష్టముగ నిర్వర్తింపఁబడి నది. దారికలార! రండు! పోదము.

రాజు

ప్రియురాల! యిప్పుడు విడిచిపోయెదవేని ప్రసాదితుఁడను కానుజుమీ!

ఔశీనరి

ఆర్యపుత్త్రా! పూర్వ మెన్నడును నిప్పటి నియమము నుల్లంఘించి యెఱుఁగను
(అని పరిజనముతో నిష్క్రమించును)

ఊర్వశి

సఖీ! యీ రాజర్షి ప్రియకళత్రుఁడు! నే నేమో నాహృదయ మను త్రిప్పికొన లేక యున్నాన.

చిత్రలేఖ

స్థిరాశమైనది యెట్లు మఱలును ?

రాజు

(ఆసనము సమీపించి) వయస్య! ద్దేవి దూరము పోలేదుగదా!

విదూషకుఁడు

చెప్పదలఁచినది నిర్భయముగఁజెప్పుము! అసాధ్యమని నిశ్చయించిన పిమ్మట వైద్యుఁడు రోగినివలె ద్దేవి నిన్ను వదలిపోయినది.

రాజు

ఒక వేళ యూర్వశి —

ఊర్వశి

(తనలో) కృతార్థ యగునా ?

రాజు

కనరాక మెలఁగి యల్లన నింపునేమొ!
హంసక కలస్వనమైన శ్రవణయుగళి
వెనువెన్క డాసి మెల్లన మూయునేమొ!
నా కనుదోయి తనకేలి కలువదోయి

ఎలగోలు సేయునో! చెలువ వేసవి నంటి
    తెరలు వేయుచుఁగోన విరులతావి
పొదవయి నామ్రోల పొలయునో! లీల, లో
    చనభాగ్య మవ్విలాసినిగ నొదవి

ప్రాలి యిమ్మేడపైని సాధ్వసభరావ
సన్నచేతనయై నడ జడను వడినఁ
జతురసఖి తేరఁ దేరంగఁ బ్రతిపదమున
నలసవిన్యాసాంగలక్ష్మి రానయిన నగునొ! 58

చిత్రలేఖ

సఖీ! ఊర్వశీ! యీ మన మనోరథమును పరిపూర్ణ మొనరింపుము!

ఊర్వశి

(ససాధ్వసముగ)

ఇంక విన్నవింతును-

**(అని వెనుకనుండి వచ్చి రాజు కన్నులు మూయును
చిత్రలేఖ విదూషకునికి సంజ్ఞనందిచ్చును)**

రాజు

(స్పర్శము రూపించి)

సఖా! యీ వరోరువు నారాయణోరుసంభవ కాదుగదా!

విదూషకుడు

నీ వెట్లు తెలిసికొంటివి?

రాజు

ఇందు తెలియవలసిన దేమి?

ఉల్లసితానురాగమున నూర్వశి యొక్కతె కాక; యింక, నే
హల్లకపాణి యంటిన, ననంగ విదాహ నిపీడితాంగముల్
చల్లగునె ! ఖరాంశు ఘృణిసంతతిం దేఋనె? యెంతగ్రైరవం
బల్లి సుధాంశుగర్భ మిహికాంశు నివాతువు లారినట్లునే 59

ఊర్వశి

అమ్మో! వజ్రలేపనమున వలె బిగిసికొని పోయినచేతులను తెమల్చికొనలేక పోవుచున్నాను.

(విస్మితాక్షియై పురూరవసునికన్నులపైనుండి మెల్లగా తనచేతులను తీసికొని సహాధ్వసయై నిలుచుండును)

(రాజు చేతులతో పట్టుకొని ముందునకుఁ ద్రిప్పికొనును)

ఊర్వశి

(ఎట్టకేలకు సమీపించి)

జయము జయము! మహారాజునకు!

చిత్రలేఖ

సుఖమా! వయస్యునకు?

రాజు

ఇదె వచ్చినదికదా!

ఊర్వశి

సఖీ! దేవి మహారాజును నా కిచ్చినది. కావున ప్రణయినివలె మచ్చికతో ఈయన శరీరమున సంగతనైతిని. నన్నపరాధినిగ నెంతువుసుమా!

విదూషకుడు

ఏమీ! మీకిచ్చుటనే ప్రొద్దుక్రుంకినదా?

రాజు

(ఊర్వశి నవలోకించి)

దేవి యిచ్చు కతననే పూవుబోణి!
యీశరీరమ్ము స్పర్శ మన్నింతువేని
ఇది వచింపుము నాకు నీ వెవరి ముదల
మొదలఁ దెక్కలిగొంటి? నాహృదయ మబల!

చిత్రలేఖ

వయస్య! యీమె నిరుత్తర! నావిన్నపము నవధరింపుము.

రాజు

అవహితుఁడనై యున్నాను.

చిత్రలేఖ

వసంతము పిమ్మట గ్రీష్మసమయమున భగవంతుఁడగు సూర్యదేవుని నేను సేవింపవలసి యున్నది. ఈ నా ప్రియసఖి స్వర్గమున మీఁద దిగులుపడిపోకుండ నెట్లు చూచికొందువో!

విదూషకుడు

ఏమున్నదా స్వర్గములో? అంత దిగులుపడిపోవుటకు! తినుటకా? త్రాగుటకా? చేపలవలె గుడ్లు మిటకరించుకొని యుండుటయేకదా!

రాజు

తెలిసె! స్వర్గమ్మునా, నపిర్దేశ్యసుఖము
దాని మఱపింపనగునె యెవ్వానికిని? న
నన్యనారీ పదాబ్జ సామాన్య దాసుఁ
డీమెకుఁ బురూరవసుఁడని యెఱుఁగుమింతె 61

చిత్రలేఖ

ప్రియసఖీ! ఊర్వశీ! అకాతరవై యింక నన్ను వీడ్కొనుము!

ఊర్వశి

(చిత్రలేఖను కౌఁగిలించుకొని సకరుణముగ)

ప్రియసఖీ! నన్ను మఱచిపోవుగదా?

చిత్రలేఖ

వయస్యసంగతవైన నిన్నే నేనిది యభ్యర్థింపవలసియున్నది.

(రాజునకు ప్రణమిల్లి నిష్క్రమించును)

విదూషకుడు

భాగ్యవశమున మనోరథసిద్ధితో నీవు వర్ధిల్లుచున్నావు.

రాజు

ఈమెను ఆ మనోరథసిద్ధిగఁ జూడుము.

సామంత క్షితిపాల శేఖరమణిచ్ఛాయార్చితాజ్ఞాంకమై
యీ మోదమ్ము ఘటింపఁజాలదు సుమీ! యేకాతపత్త్రక్షమా
స్వామిత్వంబును డిందెనిందు; లలితాజ్ఞావేళ పాలింప ని
వ్వామాకోమల పాదవారిరుహ సేవా ధన్యభావంబునన్ 62

ఊర్వశి

ఇంతకన్న ప్రియతరముగ పలుకుటకు నాకు వాగ్వైభవము లేదు.

రాజు

(ఊర్వశిని హస్తమున గ్రహించి)

అహో! యీప్సితసిద్ధి యనఁగా ప్రశమితవిరోధమైన అభ్యుదయమే ఏలయన -

ఏణాంకాంశు లవ్వియే యివి సుమీ! యింపార మై సోఁకెడున్
మీనాంకాస్త్రము లవ్వియే యివి సుమీ! మేనన్ సుఖంబయ్యెడున్
హా! నన్నెంతగ నొంచె మున్నివి సఖీ! యాయల్లకల్ శాంతు, విం
పౌ నీ సంగమవేళ నెల్లవియు నత్యంతానుకూలమ్ములై 63

ఊర్వశి

ఇంత విలంబ మొనరించి మహారాజున కపరాధ మొనరించితిని.

రాజు

సుందరీ! యిట్లనవలదు.

అలఘుమతీ! చూడు! వేదనానంతరమున
సముపనతమైన సౌఖ్యంబె స్వాదుతరము
క్షితిరుహచ్ఛాయ నిర్వ్యాజశిశిర, మెండ
బడలి వచ్చిన నింక నిర్వాణపదమె 64

విదూషకుడు

భవతీ! ప్రదోషరమణీయములైన యీ చంద్రపాదములు సేవింపఁబడినవి. నీ కిది గృహప్రవేశ సమయము!

రాజు

అయిన - ప్రియసఖికి మార్గమాదేశింపుము!

విదూషకుడు

భవతీ! ఇటు ఇటు!

రాజు

సుందరీ! యిప్పటి నా ప్రార్థన యిది -

ఊర్వశి

అది ఏరీతిది?

రాజు

అనధిగత మనోరథఫలంబయిన తఱిఁ ద్రి
యామ తొలినాళ్ల శతగుణాయామయయ్యె
అకట! చరితార్థతయెకాదె? యరివ! నీ స
మాగతిని నాకు నిపుడు నట్లగునయేని- 65

(అందఱు నిష్క్రమింతురు)

ఇది తృతీయాంకము

చతుర్థాంకము

(నేపథ్యమున సహజన్యా చిత్రలేఖల ప్రవేశసూచనిగ్యైన 'ఆక్షిప్తిక'

అనుగీతి వినిపించుచుండును)

ప్రియసఖి వియోగము॥ గదు విన్ననగుచు
నడలె చెలితోడ నొక హంసి వ్యాకులముగ
రవికర స్పర్శ వికసనారంభ కమల
సరసమైన సరోవరోత్సంగసీమ. 66

(పిమ్మట - సహజన్యయు చిత్రలేఖయు ప్రవేశింతురు,

చిత్రలేఖ

(ద్విపదికతో దిక్కులవలోకించి)

గారాపు చెలి వియోగం బెదనిండి
యాదాటపెట్టంగ హంసీయుగంబు
ఉత్తలంపడు బాష్పమురలు కన్నులను
హత్తిన బెడదయై నెత్తమ్మి కొలన. 67

సహజన్య

సఖీ! చిత్రలేఖా! వాడిపోవుచున్న తామరపూవువలె వివర్ణమైన నీముఖచ్ఛాయ హృదయములోని అస్వాస్థ్యమును సూచించుచున్నది కారణమేమో చెప్పుము. నీదిగులులో పాలు పంచుకొందును.

చిత్రలేఖ

సఖీ! అప్సరసలు పర్యాయక్రమమున విర్వర్తింపవలసిన సూర్యదేవుని సేవలో నుండి ప్రియసఖిని విడిచి మిక్కిలి దిగులు పడియున్నాను.

సహజన్య

మీ యన్యోన్యప్రేమ నే నెఱుగుదును. తరువాత -

చిత్రలేఖ

ఇటీవల నూతనవృత్తాంత మేమైనఁగలదో యని ధ్యానము నవలంబింపగా ఒక అత్యాహితము తెలియవచ్చినది.

సహజన్య

అది యేరీతిది?

చిత్రలేఖ

(సకరుణముగ)

అమాత్యులయందు కార్యభరమిడిన లక్ష్మీసనాథుఁడైన ఆరాజర్షిని గైకొని యూర్వశి కైలాసశిఖరప్రదేశము నందలి గంధమాదనవనమునకు విహారార్థమై యరిగినదట!

సహజన్య

(సప్రశంసముగ)

అట్టి ప్రదేశముల యందలి భోగమే భోగము! అటు పిమ్మట -

చిత్రలేఖ

అచ్చట మందాకినీ తీరమునందు - ఇసుకతో పిచ్చికగూళ్లు కట్టికొని యాడుచున్న ఉదయవతి యను విద్యాధరకుమారికను ఆరాజర్షి పరికించి చూచెనని నా ప్రియసఖి యూర్వశి యాయనపై కోపగించినది.

సహజన్య

పరాకాష్ఠ కెక్కిన ప్రణయము సహనశీలము కాదు! ఎంత విచారించినను భవితవ్యతయే యీవిషయమున బలవతి! పిమ్మట ?

చిత్రలేఖ

పిమ్మట - పతి యనునయ - గైకొనక గురుశాప సమ్మూఢహృదయమై యున్నందు వలన దేవతా నియమమును విస్మరించి స్త్రీ జన పరిహరణీయమైన కుమారవన - నందు ప్రవేశించెను. ప్రవేశించుట తోడనే ఆమె రూపము కాననోపాంతము నందలి లత పరిణమించెను.

సహజన్య

(శోకముతో)

ఎన్ని విధములఁ జూచినను విధికి అలంఘనీయమన్నది లేదు. ఆ విధమైన ప్రేమకు మఱియొక విధమైన పరిణామమే కలిగినది. అటు పిమ్మట ?

చిత్రలేఖ

పిమ్మట - ఆ రాజు కూడ ఆ యడవి యందే ప్రియురాలి నన్వేషించుచు పిచ్చి వాఁడయిపోయి "ఇదుగో ఊర్వశి!" "అదిగో ఊర్వశి! అనుచు నహోరాత్రములు వెళ్లఁ దీయుచున్నాఁడు. (ఆకాశము వంకఁ జూచి) ఇది యిట్లుండ - సుఖజీవులకు కూడ దిగులు పుట్టించు వర్షాసమయము కూడ ఇప్పుడే వచ్చినది. ఆ రాజుస్థితి ఏమి కానున్నదో అని విచారముగా నున్నది.

(పిమ్మట - జంభలిక)

గారాపుఁ జెలి వియోగం బెదనిండి
యారాట పెట్టంగ హంసీ యుగంబు
ధారాళ బాష్పంబు పూరార్ద్రమగుచు
నూరక సరసిలో నుమ్మలంబందు 68

సహజన్య

మఱి - సమాగమోపాయ మేమైన నున్నదా?

చిత్రలేఖ

గౌరీ చరణ రాగసంభవమైన సంగమమణిని విడిచి సమాగమోపాయ మెక్కడిది?

సహజన్య

అట్టి ఆకృతివిశేషములు చిరదుఃఖమునకు భాజనములు కానేరవు. అవశ్యము - అనుగ్రహహేతువైన ఒక సంగమోపాయము కలిగి తీరునని యూహించుచున్నాను. (తూర్పుదిక్కు వంకఁ జూచి)
మఱి రమ్ము! ఉదయాచల స్థితుడైన భగవంతుఁడగు సూర్యుని సేవింతము

(అనంతరము ఖండధార)

వందిన యెదలోని కుందువో సకియ
యెందైనఁ గనవచ్చునేమో యటంచు
చెందమ్మి పరిదోటఁ జెలువైన కొలని
యందలయును హంసి మంద ప్రచార 69

(అని నిష్క్రమింతురు)

ఇది విష్కంభకము

(నేపథ్యమున పురూరవసుని ప్రావేశికియైన ఆక్షిప్తిక)

పరితః పల్లవ పుష్ప కేసర రజః పాళీ సుధూళీ విధూ
సర కుభావపు స్ఖగ్గతి, వశాత్ప్రాపితాయల్ల
జ్వర సంవర్ధిత చిత్తభూ విపిధ చేష్టా బంధురోన్మాద మ
ధర గంధద్విపరాజ మేగుందె! కాంతాంతరాప్వముత్కలన్ 70

(పిమ్మట - ఆకాశమున దృష్టి నిలిపి సోన్మాదుఁడైన రాజు ప్రవేశించును

రాజు

ఆఁ దురాత్ముఁడా! రాక్షసుఁడా! నిలునిలు! నా ప్రియురాలిని తీసికొని యెచ్చటికి పోవుచున్నావు (విలోకించి) అవురా! శైలశిఖరమునుండి ఆకాశము పైకెగిరి నన్ను బాణములతో అభివర్షించుచున్నాఁడు.

(మంటిబెడ్డ తీసికొని కొట్టుటకు పరువెత్తుచు పిమ్మట ద్విపదికతో
దిక్కుల నవలోకించి)

ఎరగలియై ప్రియావిరహ మేచి హృదంతర మేర్చుచుండఁ దా
నెరకల నార్చి మిన్నకయె యట్టటు నీల్గెగఁ జిమ్ముచున్ నిరం
తర నయనాంబు సంహతుల దండడి దోయిడియై చూడ్కితోఁ
దరుణ మరాళ మొక్కఁడిదె! తామరసాకరమందు నందురున్ 71

విభావించి సకరుణముగ)

ఎంత మోసపోయితినో!

క్రమ్మిన క్రొమ్మొయిళ్లియివి! గంధనిశాటుఁడుకాదు; మిన్నులన్
బమ్మిన వేల్పువిల్లె యిది! పన్నిన రక్కసివిల్లుకాదు; హా!
చిమ్మిన జల్లె! యంపఱల చిందఱకా; దొఱగంటి హొంజిగుల్
గ్రమ్మగ దాఁటు క్రొమ్మెఱుఁగె! కాదిదియూర్వశి నా యనుంగహో!
72

(అని మూర్ఛితుఁడై పడిపోవును)

(తిరిగి ద్విపదికతో లేచి నిట్టూర్చి)

తెక్కలించె మృగాక్షి రక్కసుం డెవఁడో
యుక్కివుండని కోపమెక్కి మిన్నరయ;
అక్కటా! ముంచె ధారాసారములను
క్రొక్కారు మెఱుఁగుతోఁ గ్రొమ్మొయి లదిర! 73

(అని - సకరుణముగ ఆలోచించి)

ఎక్కడికి వెళ్ళియుండునో కదా రంభోరువు!

అలిగి యదృశ్యయై నిలుచునా! చిరకోపనకాద; యొక్కెడన్
మలఁగి సురాలయం బరుగునా! మది నాదెస కూర్మినిండు తొ
య్యలి; కమరారు లాచికొనిరా! యనఁ గారు వలంతు లంతకున్
జెలి కనరామికైన పధినేతకుఁ దోఁచదహేతు వింతకున్ 74

(అని మూర్ఛిల్లి పడిపోవును)

(తెలివి వచ్చి దిక్కులు చూచి సబాష్పముగ ద్వివదికతో)

ఆహా! అదృష్టము పెడమొగముపెట్టిన వారికి దుఃఖము వెనువెంటనే మఱి యొక దుఃఖము వచ్చుచుండును. ఏలయన-

సరవిన్ గ్రమ్ముకొనెన్ విరాతప దినశ్యామానవచ్ఛాయ, న
య్యరవిందాననతో వియోగ మిటుడాయన్ మాయురే! పైపయిన్
స్ఫురితేందీవర కాంతిబంధుర ఘనస్తోమమ్ము లాసార మా
సరముల్ వార్షుక వాసరమ్ము లఖిలాశారుద్ధ మార్గములై 75

(అనంతరము చర్చరి)

నవవారిద! దిగంగనాముఖాబ్జముల,
కవకుంఠమయ్యె నీ యాసారపటముఁ
దివియవే యింత! పృథ్వీస్థలి రోసి
తివిరి యెందైన నిందీవరాలోక
లోచనోత్సవసీమఁ జూచితినేని;
ఏచిన నీనేతలెల్ల నేనోర్తు 76

(నవ్వి)

ఈ మనస్సంతాపమును నేను మిన్నక పెరుగ నిచ్చుచున్నాను. మునులుకూడ నిట్లందురు - "రాజా కాలస్యకారణం" అని - అయినచో - ఇప్పుడు నే నీ జలధరసమయమును ఏల ప్రత్యాదేశము చేయరాదు?

(అనంతరము చర్చరి)

గంధోన్మాదిత బంభరీ మధురురీ కాకుస్ఫురద్గీతితో
బంధూకారుణ నేత్ర కోకిల కలవ్యాహార తూర్యాళితో
సంధించెన్ లలితాంగహార కలనన్ శాఖాప్రమాణమ్ముగా
మందారద్రుమరాజు కెందలిరులన్ మందానిలస్పందియై 77

(అని నర్తించి)

ఒక విధముగఁ జూచినచో - ప్రత్యాదేశము చేయనేచేయను - ఈ వర్షా కాల చిహ్నములే కదా! యిప్పుడు నాకు రాజోపచారములు చేయుచున్నవి.

కోలమెఱుంగుల కుందనపుంబని కూర్పు వితానము క్రొమ్మొయిళ్లై
వ్రేలిన గుత్తులె వీవనలై యిదె! వీచె సుమాళిగ వేతసముల్
హాళి ఘనాగమ హర్ష మయూర హళాహళి వందికులార్భటులై
జాలుగ వాఃకణజాల సుమౌక్తికజాల మొసంగిరి శైలనృపుల్ 78

(మఱల చర్చరి)

ఈ ప్రాభవ పరిచ్ఛద ప్రశంసల వలన నేమి ప్రయోజనము? కానిమ్ము! ఈ యడవిలో నిప్పుడు ప్రియురాలిని అన్వేషింప వలయును.

(పాతాంతమున - ఖిన్నకము)

తరుణీ విరహ భృశార్తము
పరి మంథర హృదయదైన్య భావితగతియై
కరిరాజు వికసితోజ్జ్వల
గిరికానన మేగుత్రోవ కెలఁకుల సొలసెన్ 79

(పిమ్మట ద్వితదికతో పరిక్రమించి చూచి హర్షముతో)

అక్కటా అక్కటా! వ్యవసాయోన్ముఖుఁడనైనవేళ నా కిదిసందీపనముపల
నైనది ఏమన -

ఆరక్తాంత మనోజ్ఞ రేఖలబెడంగా రేకులన్ వర్షవాః
పూరోత్పీడిత గర్భకేసర దళత్పుష్పంబు లల్లార్చి. య
న్నారీరత్నము నాటి చన్న నిభృతాంతర్బాష్ప రోషారుణ
శ్రీ రజ్యన్నయనాంతరేఖఁ దలఁపించెన్ గందళీ షండముల్ 80

ఈ దారిని వెళ్ళినదని యే తీఱున నామెను గుర్తింపనగును? ఏమనిన -

రాజ న్మేఘఘటాభివృష్ట సికతారమ్యాటవీక్షోణు, లా
రాజీవానన మెట్టియేఁగినయెడన్ లాక్షానువిద్ధాంఘ్రి పా
థోజద్వంద్వము హత్తి యొత్తికొనియుండున్ శ్రోణిపక్ష్మోన్నత
శ్రీ జాగ్రత్పదరేఖ లివ్వనమహీ సీమంతభూషాకృతిన్ 81

(ద్వితదికతో పరిక్రమించి చూచి హర్షముగ)

దొరికినది గుర్తు! ఆ కోపన యేఁగిన మార్గము నింక యూహింపవచ్చును-

మంథరమైన కోపమున మాఁగిలి మత్ప్రణయావమానన
స్పందిత రూక్షయానమున భామిని యెందుమలంగెనో కదా !
యిందు శుకోదరద్యుతి మహిన్ దిగఁజాఱెను మోవిలత్తుకన్
క్రందయి లగ్నబాష్పకణికా మణికాంతి పయంటయే యగున్ 82

కానిమ్ము- ఇప్పుడు దీనిని ఎత్తికొందును!

(సమీపించి నిరూపించి కన్నీటితో-)

ఇది- ఇంద్రగోపములతో నిండిన పచ్చికపట్టు!

ఈ యడవిలో ఎవరినుండి ప్రియురాలి వార్త రాఁబట్టి కొనుట?

(విలోకించి)

ఇదిగో! వానజల్లులచే ఏఁదు విచ్చికొనినట్లున్న యీకొండచఱియపై నున్న పాషాణముపై నెక్కి –

ఆలోకించు పయోదమాలికల నభ్యాయాత వాత్యారయ
వ్యాలోల స్ఫురితాంశు భాసుర శిఖండాఽపీడమై క్షోణిభృన్
మౌళి ప్రాభవశోభ దూరనమితోత్కంఠోన్నమత్కేకతో
శైలారూఢ మయూరరాజు। సముదంచ త్పింఛరింఛోళియై 83

(సమీపించి)

ఇప్పుడు దీని నడిగి చూచెదను!

(అనంతరము ఖండకము)

అడలు నెడతో బడలు నడతో
పడఁతిఁ గన్గొను కోర్కె నెమ్మది చిదిముడిం బడుచున్
వదలు శ్వాసల, కదలు నాసల
విదళితారి మదేభ మొక్కఁడు వెడలె వనవీధిన్ 84

(తేనా ఖండకాంతరమున చర్చిరి)

ఏ నభ్యర్థన మాచరింతు నిను నెమ్మి! చెప్పవే? నాకు, ని
క్కానం గ్రుమ్మరువేళ నెందయిన నా కాంతామణిం గంటివే?
ఏణాంక ప్రతిమాన యాననమునన్ హేలామరాళీ సమన్
యానంబందున నీకు నిమ్ముగ నభిజ్ఞల్ సెప్పితిన్ వింటివే! 85

(చర్చరికతో - కూర్చుండి దోసిలి యొగ్గి)

ఓ నీలకంఠ, మదుత్కంఠ హృదయ
వనభూమి నెందైన వనిత నొక్కతెను
ఓ సితాపాంగ! దీర్ఘాసితాపాంగ
దర్శనీయాకార. దర్శించినావె? 86

(చర్చరికతో - విలోకించి)

ఏమిది? నామాటకు బదులు చెప్పకయే నర్తించుటకు మొదలు పెట్టినదే! దీని హర్షమునకు కారణమేమైయుండునో! (ఆలోచించి)

ఆహా! తెలిసినది.

లీలా వాయు విధూతి వాదు నవలా లేమింగదా! నేటికి
హేలా బర్హము విస్సపత్నమయి నర్తించున్ మయూరంబహో!
కేళీ సంశ్లథ బంధహారి సుమనః కీర్ణాంతరాళంబు మద్
బాలాఽనీల మనోజ్ఞ కైశిక కలాపంబున్నఁగవ్విప్పవే 87

కానిమ్ము- ఒరుల దుఃఖమును జూచి ఆనందించు దీనిని మఱి-అడుగను.

(ద్విపదికతో దిక్కులవలోకించి)

ఓహో! ఆతపాంతమున మదము తలకెక్కిన కోకిల యీ నేరేడు కొమ్మపై నెక్కి కూర్చున్నది. విహంగములలో నిది పండితజాతి! దీనిని అడిగి చూచెదను.

(అనంతరమున ఖురళము)

విద్యాధర కానన లీనంబై
సద్యోగళితాశ్రు వితానంబై

దూరోజ్ఝితసుఖ హృదయ విదూనము
వారణపతి యంబర విభమానము 88

హేలే! హేలే!

నందన వనాంత విహరణానందశీల!
పరభృతా! మధురాలాప పండితా! వ
నాంతములలోనఁ దిరిగి యెందైన నాదు
కాంతఁ గనియుందు వేని, పల్కంగరాదె? 89

(దీనినే నర్తన మొనరించి కలంతికతో - సమీపించి - మోకరిల్లి నిలిచి)
భవతీ!

పూని ప్రసూనధన్వునకు పౌత్త్రివి యందురు నిన్! మనస్వినీ
మాన విఘాత దక్ష వరమాస్త్రిమ పందురు; నెందుఁబోయెనో
మావిని నప్సరోభువన మౌళివతంసము నిందుఁ దేఁగదే!
ఆ నళినాక్షి యున్నయెడకైన ననున్గొనిపోఁగదే పికీ! 90

(ఎడమకు కొంచెము మలఁగి - ఆకాశ మున)

ఆఁ! ఏమనుచున్నావు? ఇంత అనురక్తుఁడవైన నిన్నేల వదలిపోయిన దనియా! అయిన వినుము -

అలిగె; నయినఁగాని. వలుతకుఁ గతమేమొ
యరయ నేరనింత. ఆత్మగతము
అలుగ నెరసటంచు వలయునే! యొక్కండు?
ప్రియుల మీఁద ప్రభుత! దయితలకును॥ 91

(ససంభ్రమముగఁ గూర్చుండి - పిమ్మట మోకరిల్లి నిలిచి
'అలిగె నయినఁగాని' - చదివి - విలోకించి)

అవురా! ఇది కథావిచ్ఛేద కారిణియై తన పనియందే నిమగ్నురాలైనది.

అన్యదుఃఖము శీతలమ్మండ్రదు నిజమె
యెదరులో నున్న నామాట పెడచెవి నిడి
అధరమానెడి రీతి మదాంధః గదిసె
అల్లొనేరేడు పండు దా నాస్వదింపc 92

దీని వైఖరి యెట్లున్నను ప్రియురాలి వలెనే యిదియును 'మంజులాలాపకదా!' యని దీనిపై నాకు కోపము వచ్చుటలేదు.' 'భద్రా! నీవు భద్రముగా నుండుము. మేము పోయివచ్చెదము.

(లేచి ద్విపదికతో పరిక్రమించి అవలోకించి)

ఓహో! యీ వనధారకు దక్షిణము వైపునుండి ప్రియాచరణన్యాసశంసియై నూపుర శబ్దము వినవచ్చుచున్నది. దీనిని అనుసరించి పోయెదను.

(పరిక్రమించి)

(కకుభరాగముతో షట్చరణమైన గీతి)

యోషిద్విరహ దుఃఖశోషితాననము
మాసరాశ్రుచ్ఛన్న మసృణలోచనము
దుర్భర దుఃఖ విధూతయానంబు
నిర్భర గురుతాప నిర్దహత్తనువు
అధిక దూనస్వాంత మద్రిపార్శ్వమున
వ్యథలతో గజరాజు వనవీథిc దిరుగు 93

(అనంతరము ద్విపదికతో - దిక్కుల నవలోకించి)

ఎడసి కూరిమి పడఁతి దరిగొామ
నడలు చిచ్చుల వెచ్చనలఁ గడుబడలు నెమ్మనై
సుడిసె నడవుల యెడరు బాటల
నుడుగకయె గజరాజు బాష్పపుజడులు పెనుసోనై 94

(సకరుణముగ)

హా! కష్టము కష్టము!

అంబుద శ్యామములు దిశాంతంబు లరసి
మానసోత్సుక హృదయమై లోని దిగులె
కూఁతలో సన్న జాలిగాఁ గ్రోల్చె హంస
కా దిది ప్రియాంఘ్రినూపురక్వణిత మరయ 95

కానిమ్ము - మానస ప్రయాణోన్ముఖములైన యీ విహంగమములు - ఈ సరస్సునుండి యెగసిపోవక మునుపే వీనివలన ప్రియురాలి వార్తను తెలిపించి కొనవలయును.

అహో! జలవిహంగమరాజ!

మృస్పృణాలాప విడంబిత ప్రియసఖీ మంజీరమా! నిల్వుమా!
బిస పాథేయము డింపుమా! చెలికతన్ విన్పింపుమా! సుంత, మా
నస మీ వేగెదుగాని మీఁద: నను చింతాంభోనిధిం దేర్పుమా!
స్వ సుఖాతీతము హంసమా! ప్రణయి యాచ్ఞాపాలనంబే సుమా! 96

(మార్గోన్ముఖుఁడై చూచుచుండును)

'మానస సరోవరమునకుఁ బోవు తొందరలో నుండి-గమనింపలేదు' అని కాఁబోలు చెప్పుచున్నది.

(కూర్చుండి చర్చరితో)

ఓసీ! హంసమా! దాచుచున్నావా?

(అని నర్తన మొనరించి లేచి)

ఈ నదీ తటమున నానతభ్రూవు
నీ చూపు మేఱలో నిలువనినాఁడు
అయ్యారె! తెక్కలి హంసమా! రమణి
యొయ్యారి నడలెట్టు లొడిచి కొన్నావె? 97

(చర్చరి)

నీ కుల్కు నడజాడలే నెఱింగితిని.

(చర్చరితో - సమీపించి - దోసిలియొగ్గి)

పలు పలుకు లేల హంస! నాచెలువ నిమ్మా!
ఆమె నెన్నడలెల్ల నీవాచికొంటి
గుర్తిడిన భాగముంబట్టి కొదువసొమ్మ
నడుగు టున్నదె కద! లోకమందు నెందు 98

(ఖురిల చర్చరి)

ఎచ్చట నేర్చితే! యీనడబెడఁగు
లచ్చుగ జఘన భరాలస గతివె 99

("ఖురిల చర్చరి, పలు పలుకులేల హంస!" అన్నది చదివి
ద్విపదికతో నభినయించి నవ్వి)

"ఇదుగో! దొంగలను శిక్షించురాజు!" అని భయపడి ఎగిరిపోయినది. ఇంకొక ప్రదేశమున కేగెదను.

(ద్విపదికతో పరిక్రమించి చూచి)

ఓహో! ప్రియాసహితమై చక్రవాక మిచ్చట నున్నది

దీనిని-అడిగి చూచెదను.

(అనంతరము కుటిలిక)

విస్మృమర మర్మర విపిన తలములో

(ఖల్లఘుటి)

కుసుమిత కిసలిత కుజములలో

(చర్చిరి)

అలయుచు నిదె! తిరుగాడు గజేంద్రము
వెలఁది విరహమున వేఁదురులై 100

గోఱజపుఁ గుంకమపు టాఱజపు వన్నె
లాఱ బెడఁగాఱెడు రథాంగమా! చెపుమ!
ఆమని పవళ్లను నిరాకులత నలరు
నా మగువ ధన్యాత్మ నారసితె? వీవు! 101

(చర్చరికతో - సమీపించి మోఁకరిల్లి నిలిచి)

చక్రనామ విహంగమా! చక్రవిపుల
జఘన నెడఁబాసి యితఁడొక చక్రవర్తి
నిన్నడుగుచున్న వాఁడిటఁ గన్నచెపుమ!
సకియ వార్త మనోరథ చక్రవర్తి. 102

ఏమీ! "కః కః" అనుచున్నది. అవురా! దీనికి నేనెవ్వరనో కూడ తెలియక యున్నది కాఁబోలును!

ఆ సహస్రాంశు మిహికాంశు లంది రెవని
కర్థి మాతామహ పితామహత్వ పదవి;
విని యెఱుంగవొకో! స్వయంవృతుని వాని
నుర్వికిని నూర్వశికిఁ గూర్చు నొడయఁడనఁగ 103

ఏల మిన్నకయున్నది? కానిమ్ము- దీని నధిక్షేపించెదను,

(మోఁకరిల్లి)

ఇతరులును మనవంటివారే యని యెఱిఁగి నడచికొనుట యుక్తము. ఏలయన-

కొలనిలో నొక్క తమ్మియాకున మలంగి
కనుమఱుంగైన యంత నీకాంత దూర
వర్తినిగ నెంచి వాపోయి వనరెదుగద!
అడలు నాప్రశ్నకున్ బదులాడ వదిర! 104

(కూర్చుండి)

ఇది- అన్ని విధముల నాయదృష్ట విపర్యయము యొక్క ప్రభావమే! వేఱొక యెడకుఁ బోయెదను.

(ద్వితీయదిశతో పరిక్రమించి చూచి)

ఓహో!

లీన షట్పదమై లోన లోన మొరయు
నీ నవారవిందము విరోధించునన్ను

తవిలి నాచేత మోవి యొత్తంగఁ బడిన
మొనయు సీత్కృతిఁ జెలువ నెమ్మోమువోలె 105

ఇచ్చటి నుండి వెళ్ళి పశ్చాత్తాప పడకుండుటకై కమలినిషేవియైన యీ భ్రమరమును గూడ నడిగి చూచెదను.

(పిమ్మట - అర్థ ద్విచతురస్రకము)

ఒరిమఁ బెంపొందిన గురుతర ప్రేమ
సరసమౌ నెత్తమ్మి సరసిలోపలను
కెరలు వియ్యాదియుఁ గామరసైకవృత్తి
తరుణ మరాళంబు ధన్యజీవితము 106

(చతురస్రకముతో - చేరవచ్చి - దోసిలి యొగ్గి)

మధుకరమ! చెప్పఁగదవె యమ్మదిర నయన
వార్త: చూడనెలేదొ! యివ్వనమునందు

(విభావించి)

తన్ముఖోచ్ఛ్వాసగంధంబు దవిలితేని
కమల గంధమ్ములకు నీవు భ్రమయుదెట్లు? 107

(అని ద్విపదికతో - పరిక్రమించి - అవలోకించి)

ఓహో! కరేణు సహాయమై యీ గజరాజు నీపస్కంధ నిషణ్ణమైయున్నది.

దీనిని - అడిగెదను

(ఖలిక)

కరణీ విరహజ్వరతాపితమై

(మందఘుటి)

కాననమున గంధభ్రమదళియై

(అర్ధోక్తిగ మధ్యలోఁజూచి)

అయినను- ఇది సమీపింపఁ దగిన సమయము కాదు-

నెయ్య మారంగఁ బ్రియకరిణీ కరాగ్ర
సముపనీతంబు సల్లకీశాఖిక నిదె
సోఁగ కెందలిరాకుతో సురభిగంధి
నందికొనఁగాక! యిప్పుడే నడుగరాదు 109

(స్థానకముతో నవలోకించి)

ఇదిగో! దీని యాహారసేవనము పూర్తియైనది - దగ్గఱకుఁబోయి అడిగెదను-

(అనంతరము చర్చరి)

ఏ నడిగెదఁ జెప్పు మిభలోకనాథ!
లలిత ప్రహారైక దళిత తరుయూథ!
దూర వినిర్జిత తుహినాంశు కాంతి
యీదారిఁ జనఁ జూచితే? యొక్కయింతి 110

(రెండడుగులు ముందునకువచ్చి)

మదకలము! యువతి శశికళ
గద! గజయూథపమ! యాదికాశబల కచా
భ్యుదయ స్థిరయౌవనన్ వన
పదవి సుఖాలోకఁ గంటివా దవ్వులలో 111

(హర్షముతో నాకర్ణించి)

అహహా! ప్రియాసమాగమశంసియైన యీ మంద్రకంఠగర్జితము నన్నాశ్వాసించుచున్నది. గజరాజా! మన సమాన ధర్మములను బట్టి నీయందు నాకు మిక్కిలి మక్కువ!

పృథివీపతుల కెల్ల నధిపతి నేనంద్రు
　　　భద్రదేశముల కెల్లఁ బ్రభుఁడవీవు
అవిరళ గళిత దానాంబువృత్తివి నీవు
　　　నర్థుల యెడ నేను నగుదు నటులె
స్త్రీ రత్నముల నూర్వశి యుఁ బోలె నాకు, నీ
　　　గమిలోన నీకు నీకరిణి గూర్చు
నన్నింట నీకు నా కమరియున్నది పోల్కి-
　　　యదవుఁ బేఁడ! యట్లయినఁ గాని
నావలెఁ బ్రియావియోగ దుఃఖావిలతను
బడల వీవి త కంట నీరిడవు నిడుద
యూర్పులు నిగుడ్పవును విలాపోపమియును
నెఱుఁగ వెవ్వని భాగ్యంబు లెవనికబ్బు?

నీవు సుఖముండువుగాక!

(ద్విపదిః తో పరిక్రమించి

ఓహో! యిది సురభికందరమనెడు విశేషరమణీయమైన సానుమంతమ
ఇది అప్సరసలకుఁ బ్రియమైనది కూడ- ఒక వేళ - ఈపర్వత ప్రాంతభూ;
యందు కనిపింప వచ్చునేమో!

(పరిక్రమించి చూచి)

ధాంధకారమ! నిమ్ము - మెఱుపు వెలుఁగులోఁ జూచెదను అవురా!
నాదుడిత పరిణామముచేత మేఘోదయముకూడ శతహ్రదాశూన్యమై
యున్నది అయినను - ఈశిలోచ్చయమును అడుగక - మఱలిపోను

(అనంతరము ఖండిక)

ఖరఖుర దారిత నిష్ఠుర
ధరణీ, గహన వం పథములఁ దారునిదె! తమః
స్ఫురితాపఘన ఘనము వి
ర్భర ఘుర్ఘుర ఘోషమగు వరాహ మురవడిన్ 113

తనుమధ్య యున్నదే? వనమధ్యసీమ
పర్వసన్నతగాత్రి పర్వత ! చెపుమ!
అతిలోక సౌందర్యజిత రతిరూప
పృథునితంబాభోగ పృథుల వితంబ! 114

ఏలనో మిన్నకయే యున్నది! దూరము నుండి వినిపించుటలేదు కాఁబోలును!
కానిమ్ము - దగ్గఱకే పోయి యడిగెదను.

(అనంతరము చర్చరి)

స్ఫురిత స్ఫటిక శిలా ని
ర్ఝర! విరచిత కుసుమ శేఖరా! ముఖరిత కి
న్నర మధురోద్గీతమనో
హర! నా ప్రియతమను జూపరా! యవనిధరా! 115

సర్వక్షితిభృన్నాయక!
సర్వాంగస్ఫురిత సకల సౌందర్య, వనాం
తోర్వీ పథముల దృష్టయె?
పర్వాడి నాచేత విడువఁబడి మఱి నీచే 116

(తిరిగి అవిధముగు శబ్దమునే విని హర్షముతో)

ఏమీ! యథాక్రమముగ కనిపించినదనియే చెప్పుచున్నది. - కానిమ్ము - చూచెదన

(దిక్కులవంకఁ జూచి సఖేదముగ)

అయ్యో! గుహాంతరాళముల యందు ప్రసరించుచున్న యీ ప్రతిశబ్దము నాదే!

(అని మూర్ఛిల్లి పడిపోవును)

(లేచి కూర్చుండి సవిషాదముగ)

హా! మిక్కిలి అలసిపోయితిని. ఈ గిరినదీతటము నందించుక సేపు తరంగా నిలముచే సేద దేఱుదును.

(ద్విపదికతో - పరిక్రమించి చూచి)

క్రొత్త నీటితో - కలఁగి - ఎఱ్ఱఁబాఱిన యీ స్రోతోవహను జూచుచున్న కొలఁది నాకు ప్రీతి కలుగుచున్నది. ఏలయన-

అల లంతంతకు విక్కు కన్బొమ బెడంగై; భ్రాంతహంసీ హళా
హళి యువ్వెత్తుగ మ్రోయుమువ్వమొలనూలై; లాగు పెన్నుర్వు దు
వ్వలువై; సారెకుఁ దొట్రిలంబడెడు త్రోవై; యున్నదీ రూపమై
మలఁగం బోలును కాంత! తప్పదెదలో వల్లాడు పెల్లీసునన్ 117

కానిమ్ము - ఇప్పుడీమెను ప్రసన్నగాలినిఁ జేసికొందును.

(అనంతరమున - కుటిలిక)

కూలముల నంచపిండు గగ్గోలు పడిన
తీరముల లేటికూనలు దిగులు పడిన
అళికులైక ఝుంకారమై యరుగు మరన
దీ! ప్రియా! యీనమస్కృతిఁ దేరికొనవె! 118

(కుటిలి కానంతరమున చర్చరి)

తొలిదెసఁ దాఁకిన తెరగాలులఁ బెల్లలము నలల నిఱుగేలులతో
మబ్బు నొడలితో గబ్బి కదలి యిదె! చెలువమ్ముగఁ దానాడున్
అంచలు కొంచలు సంకులు కుంకుమ యలవరించి మెయిఁ
దొడవులుగా
కరి మకరాకుల కృష్ణకమల పరికల్పితరుచిరావరణముతో
వేలా సలిలోద్వేల్లిత కరకృత తాళగతిన్
కప్పి కకుప్పులు పదియుఁగడల నవకంధర నీలము కాలమహో! 119

(చర్చరికతో - సమీపించి మోఁకరిల్లి నిలిచి)

నీయందె నెనరు నాటిన
ప్రేమాంసుని ప్రణయభంగ భీరువు నకటా!
ఏ యపరాధలవముగని
పాయఁగ నెంచితివో? దాసభావుని లలనా! 120

ఏలనో మిన్నకయే యున్నది. అయినను - పరమార్థముగ నిది నదియేకాని- ఊర్వశి కాదుగదా! ఊర్వశియే యైనచో పురూరవసుని విడిచి సముద్రాభిసారిణి యెట్లగును?

అనిర్వేద ప్రాప్యములు శ్రేయస్సులు!

కానిమ్ము - ఎచ్చట నా ప్రియురాలు మొదట నదృశ్యురాలయ్యెనో ఆ ప్రదేశమునకే పోయెదను-

(పరిక్రమించి - చూచి)

ఇచ్చటఁ గూర్చుండి యున్న యీసారంగమును ప్రియురాలి వార్తకై అభ్యర్థించెను.

విరిసిన పూవుగుత్తులను విందగు మ్రాఁకుల క్రేవలన్ మనో
హర పికకూజితాళి నినదార్భటి సంకులమైన త్రోవలన్
సురవన మధ్య వీథికల ద్రుక్కుచుఁ దాఁ గరిణీవియుక్తమై
గిఱి దిరుగున్ సురద్విపము ఖిన్నమతిన్ విరహజ్వరార్తమై 121

(మోఁకరిల్లి నిలిచి)

కృష్ణశారచ్ఛవుల్ మేన గిఱికొనంగ
మెలఁగు నీలేడి మృదులశాద్వల తలముల;
అరయ వనశోభ లీలగాఁ బరపినట్టి
కాననశ్రీ కటాక్షమై కానిపించు 122

(చర్చరి)

సురసుందరిని శ్రోణీ భర కృశాలసను
స్థిరయౌవనను పీన గురుకుచోన్నతను
వనజాత శశిబింబ వర్ధిష్ణు వదన
తనుగాత్రి నొకతె మోహనహంసగమన
గగన నీలంబైన కాననాంతమున
మృగలోచన పరిభ్రమింపఁ గంటేని
విరహార్ణవాంతరాంతరముల నుండి
దరిఁ జేర్చుమీ! నన్ను హరిణాధినాథ! 123

(చేరనరిగి - దోసిలి యొగ్గి)

కన్నావే నా ప్రియసఖి?
విన్నాణపు గుర్తు నీకు వినిపింతుఁ జూమీ!
యి స్నీ సహచరి వలెనే
యన్నెలఁతయుఁ బెద్దకనుల నట్టులె చూచున్ 124

ఏలనో - నామాట పట్టించి కొనకయే కళత్రమమున కెదురుగఁ దిరిగి నిలుచున్నది. విధివిపర్యయము పరిభవములకు స్థానమనుట యెల్లవిధముల నిజము - ఇంకొక యెడకుఁ బోయెదను.

(పరిక్రమించి చూచి)

ఆహా! ఆమె వెళ్ళిన త్రోవకు గుర్తు కానవచ్చినది.

ఆ రక్త కదంబక మిదె!
యౌరా! ఘర్మాంతశంసియగు దీనిసుమం
బారఁగ విరియక మునుమును
గారవమునఁ దాల్చె చెలి శిఖాభరణముగా 125

అదియేమై యుండునో! ఆరాళ్ళ నడుమ విక్కిలి యెఱ్ఱనై మెఱయుచున్నది.

బెరసెడి వెల్గులన్ హరివిభిన్నగజామిషలేశ మిద్ది కా
దరయ; స్ఫులింగ మన్నను వనాంతరముల్ జడిఁదోఁగియున్న వే!

(నిరూపించి)

అరుణ కదంబగుచ్ఛ రుచిరాంశువు హా! మణియిద్ది! దీని. భా
స్కరుఁడు కరమ్ములన్ దిగిచి సంస్పృహ నొందలఁదాల్ప
నెంచునో! 126

కానిమ్ము- దీనిని ఎత్తికొందును.

(గ్రహించుట నభినయించుచు)

తరుణీ నిబద్ధైక తాత్పర్య మగుచుఁ
దొరఁగెడి కన్నీటి దోయిడి చూడ్కి

వసివాళ్ళు వాడిన వదనంబుతోడ
యసురుసురై తూలి యలమటించుచును
విజనైక సంస్పృహ వినువీథిఁ గనుచు
గజరాజు తిరుగును కాననాంతముల 127

(ద్విపదికతో సమీపించి మణిని తీసికొని తనలో)

మందారములు గూర్చి మగువ వేనలిని
విందారఁగా నమర్పందగు దీని;
ఆ చెలియేలేద; యోచెల్ల! దీని
నేచిన కన్నీట నేల ముంపంగ? 128

(అని విడిచి పెట్టును)

(నేపథ్యమున)

వత్సా! కైకొనుము! కైకొనుము!

అదిరదిర! శైలతనయా పదాబ్జరాగ
సముదితంబైన యిమ్మణి 'సంగమంబు'!
ఇది ధరింపంగఁ బడు నెన్నఁడేవి నపుడె
యావహిలఁ జేయు దయితా సమాగంబు! 129

(ఊర్ధ్వముగఁ జూచి)

నన్ను - అనుశాసించుచున్న దెవ్వరు?

(విలోకించి)

ఓహో! భగవంతుఁడైన మృగరాజధరుఁడు!

భగవంతుఁడా! యీ నీ యుపదేశముచేత ననుగ్రహింపఁబడితిని.

(మణినిఁ గైకొని)

ఓహో! సంగమనీయమణీ!

అన్నెలంతఁ బాసి నవయు నన్నెన్నఁడేని
నన్నలా! యన్నుతోఁ గూర్చుటున్న దేని
మన్ననన్ నిన్ను నాశిఖామణి నొనర్తుఁ
గ్రొన్నెల శివుండు తలఁదాల్చి కొన్నయటుల 130

(పరిక్రమించి - అవలోకించి)

ఆహా! ఏమిది? పూవులు లేక బైసిమాలి యున్నను - ఏలనో యీ లతను జూడనంతనే నాకు నిర్వృతి కలుగుచున్నది! ఒక రీతిని - ఈయానందమును సముచితమే యనిపించుచున్నది.

ఏలయన—

తొరఁగెడు కన్నీటఁ దోఁగుమోవియో!
వర్షజలములఁ దడిసిన తలిరుటాకు
తొడిఁబడ నెమ్మేని తొడవులూడ్చిననేమొ!
క్రొన్ననల్ వాసిన విన్నఁదనము
చింతా భరైక సంశ్రిత మౌనముద్రయో!
యెలదేఁటి సడి యింత పొలయమియును
తత దుఃఖవృత వివిక్త స్పృహావృత్తియో!
తలిరుఁ దీవల మధ్య నెలకొనమియు
ఆఁగికొనలేని మత్ప్రణయాపరాధ
సముదితామర్షమున నన్ను చరణపతితుఁ
దొలగఁద్రోచి పదంపడి కలఁగఁబాఱి
యెడఁద; యిట్లయె నో! లతాకృతిగ, నెలఁత! 131

ప్రియానుకారిణియైన యీ లతయందు పరిష్వంగ ప్రణయినయ్యెదను.

ఇదె చూడు నను లతా! యెదమాఱియుంటి
విధియోగమున నాకు వెలఁది చేకుఱిన;
ఏ యడవికింకఁ బోనేపోను సుమ్ము
ఈ యెడకు నామెఁ దేనేతేను నమ్ము! 132

(అని చర్చరికతో సమీపించి - తీఁగను కౌఁగిలించుకొనును. పిమ్మట - ఆ లతయున్న ప్రదేశమునే యాక్రమించి యూర్వశి నిలుచును)

రాజు

నిమీలితాక్షుఁడై స్పర్శమును నిరూపించి)

ఆహా! ఊర్వశీ గాత్రస్పర్శమున వలె నా హృదయము నిర్వృతి నందుచున్నది. అయినను- విశ్వాసములేదు. ఏలయన-

తొలుత నెయ్యది భావింతుఁ జెలువఁ దలఁచి
క్షణములో నది వేఱ యొక్కటిగ మాఱు;
కాన త్వరపడి యిప్పుడు కన్నులేను
విప్ప: సంస్పర్శ భావిత ప్రియుఁడ నగుట 133

(నెమ్మదిగ - కన్నులు విప్పి)

ఓహో!!! సత్యముగా నూర్వశియే!

(అని మూర్ఛిల్లి పడిపోవును)

ఊర్వశి

మహారాజ! తేరుకొనుము! తేరుకొనుము!

రాజు

(సంజ్ఞను పొంది)

ప్రియురాల ! యిప్పుడు బ్రదికితిని.

నీ వియోగోద్భవమ్ము చండీ! యగాధ
బంధుర తమస్సునన్ దిగంబడఁగ; భాగ్య
వశత నాచేతఁ బడయంగఁ బడితి వీవు
చేతనవలెన్ గతాసువు చేత మఱల ॥ 134

ఊర్వశి

మహారాజ! క్షమింపుము! క్షమింపుము! కోపపరవశనై నేను మహారాజున కీయవస్థ తెచ్చి పెట్టితిని

రాజు

నీవు నన్ను ప్రసన్నునిఁ జేసికొన నవసరములేదు. నీదర్శనముచేత నే స బాహ్యాభ్యంతరముగ నాయాత్మ ప్రసన్నమైనది.
ఇంతకాలము నన్ను విడిచి యెట్లుండఁ గలిగితివి ?

[అనంతరము చర్చరి)

నెమలి కోయిల రాజహంసము రథాంగ
మళి గజము పర్వతము నది యా కురంగ
మడవిలోఁ దిరుగాడి నేనడుగనట్టి
వారెవరు? నోరువిడిచి నీ కారణమున ॥ 135

ఊర్వశి

మహారాజు వృత్తాంత మంతయును నాయంతఃకరణమునకు ప్రత్యక్షీకృతమే!

రాజు

ప్రియురాలా ! అంతఃకరణమనగా నేమో నాకు బోధపడుటలేదు.

ఊర్వశి

మహారాజ! వినుము. పూర్వంబు భగవంతుఁడగు మహాసేనుఁడు శాశ్వత మగు కుమారవ్రతము గైకొని అకలుషమను గంధమాదనకచ్ఛము నధివసించి యొక వ్యవస్థ చేసెను.

రాజు

అది యేట్టిది ?

ఊర్వశి

"ఏ స్త్రీయైనను - ఈ ప్రదేశమునకు వచ్చునేని - ఆమె లతాభావమునఁ బరిణమింపఁగల"దని-

స్వామి శాపాంతమునుగూడ నిట్లనుగ్రహించెను-

"గౌరీచరణ రాగసముద్భవమైన సంగమమణివలనఁగాని-

ఆ లతాభావమునుండి విముక్తి కలుగఁబో" దని-

నేను గురుశాప సమ్మూఢ హృదయ నయినకారణమున- ఆ దేవతానియమమును విస్మరించి స్త్రీజన పరిహరణీయమైన కుమారవనమునఁ బ్రవేశించితిని. ప్రవేశించినంతనే నారూపము కాననోపాంతమునందలి లతగా పరిణమించినది.

రాజు

ప్రియురాల ! అంతయు సరిపోయినది. లేనిచో-

సురత లీలాంత గాఢ సుషుప్తి మునిఁగి

సెజ్జనేయున్న ననుఁ బ్రవాసిగఁ దలంచి

యుమ్మలించెడి నీవెట్టు లోర్చియుందు

వీ చిరవియోగదుఃఖమ్ము నిందువదన ! 136

యథానిర్దిష్టముగ సంగమ సమిత్తమైన యాప్రభావముగూడ మాకు అనుభవ గోచరమైనది.

(అని మణిని చూపించును)

ఊర్వశి

ఏమీ! యీమణి సంగమనీయమా? ఇందువలననే మహారాజు కౌఁగిలించి కొనినంతనే యిట్లు మాఱితిని.

రాజు

(ఊర్వశి లలాటమునందు మణినమర్చి)

నొసటఁ బెట్టిన మణి ప్రసృత రాగమ్మ
లసలార నివి కలయంగఁ బర్వినను
శ్రీ ధురంధరమయ్యె చెలువ! నీమోము
నీరెండ లారిన నీరేజ మటుల. 137

ఊర్వశి

ప్రియంవదుఁడా! మనము ప్రతిష్ఠానము వెలువడి చిరకాలమైనది. ఒకవేళ ప్రకృతిజనులకు మనపై అప్రియము కలుగవచ్చును. కావున పోదము రమ్మ!

రాజు

నీవు చెప్పినట్లే -

ఊర్వశి

మహారాజునకు ఏవిధమగు యానమభిలషితము?

రాజు

అచిర రుగంశు లతాపరిఖేలన హారిసువర్ణ పతాకలతో
రుచిర సురేంద్ర ధనశ్శకల ద్యుతి రూపితచిత్ర పరంపరతో
ప్రచుర విహాయసవీధి చలాచల రమ్యపయోద విమానముపై
నిచయ చలాంచల ఖేలనతీ ! ననుఁజేర్పఁగదే ! ప్రవతీ !
వసతిన్ ॥ 138

(చర్చరి)

సంప్రాప్త సహచరీ స్వాత్మసంగంబు
పులక ప్రతానైక భూషితాంగంబు
స్వేచ్ఛోపనత విమానోచ్చ భూమికల
విచ్చా విహారియై యీ హంసయలరు ॥ 139

ఇది చతుర్థాంకము

పంచమాంకము

(పిమ్మట పార్శ్వములో విదూషకుఁడు ప్రవేశించును)

విదూషకుడు

ఆహా! భాగ్యవశమున చిరకాలమునకు ఊర్వశీ సహాయుఁడై ప్రియవయస్యుఁడు నందనవన ప్రముఖములైన ప్రదేశములయందు విహరించి వచ్చి మరల పురప్రవేశ మొనరించి స్వకార్యానుశాసనముతో ప్రకృతి మండలమును రంజింపఁ జేయుచున్నాఁడు. అనపత్యత్వ మొక్కటి విడిచి యీయన విషయమున విచారింపఁ దగినది లేదు.

నేఁడు విశేషతిథి! భగవతులగు గంగాయమునల పవిత్రసంగమమునందు దేవితో సహ కృతస్నానుఁడై వచ్చి యిపుడు రాజభవనములో నుపవిష్టుఁడై యున్నాఁడు.

ఈయన అలంకరింపఁబడుచుండ- రాజసోదరునివలె నేనును అనులేపన మాల్యములయందు భాగస్వామి నయ్యెదను.

(అని పరిక్రమించును)

(నేపథ్యమునందు)

అయ్యో! అయ్యో! తాళవృంతముతో కప్పి మణిని తీసికొని వచ్చునప్పుడు- ఆమిషా శంకియై గ్రద్ద తన్నికొని పోయినది.

అప్సరో విరహవేళ మహారాజు మౌళి నలంకరించిన మణి యది!

విదూషకుడు

ఎంతపని జరిగినది! ఎంతపని జరిగినది! సంగమనీయమనెడి ఆ చూడామణి వయస్యునకు పరమ బహుమతమైనది! ఇందువల్లనే అలంకరణము పూర్తి

శోకమునుపే ఆసనమునుండిలేచి పూజ్యుఁడిటువైపునకు వచ్చుచున్నాఁడు! నేను పార్శ్వ పరివర్తి నయ్యెదను.

ఇది ప్రవేశకము

(పిమ్మట – రాజు, సూతుఁడు కంచుకి వేధకుఁడు పరిజనము ప్రవేశింతురు)

రాజు

వేధక! వేధక!

విజ వధాఽఽహ ర్తయైన యాద్విజకులంపుఁ
దెక్కలీఁదెక్కదెక్కడ? నక్కివుఁడయి
తొలు దొంగత గాఁగ నెవఁడు ముచ్చిలియె సొమ్ము
నెచ్చటనో కాక దొరయింటనే కడఁగి। (140)

వేధకుఁడు

ఇదిగో! ముఖాగ్రలగ్న స్వర్ణసూత్ర లంబమానమగు మణితో ఆకాశమునకు నివ్వాళి యెత్తుచున్నట్లు వలయములు తిరుగుచున్నది.

రాజు

అదిగో! కనిపించుచున్నది.

నోటఁగఱచిన బంగరు త్రాటికొసల
వ్రేలు విమ్మణి దీధితుల్ పిరిసి మింట
గిఱులు దిరుగుచుఁ జులఁగిది కొఱవివోలె
నరుణ వలయంబులను గీయు నంబరమున (141)

విదూషకుఁడు

ఇప్పుడేమి చేయవలయునో చెప్పుము!

(చేరవచ్చి)

ఓయీ ! యిచ్చట కినికరము చాలును. అపరాధిని శాసింపవలసినదే.

రాజు

లెస్సగా పలికితివి ! ధనుస్సు ! ధనుస్సు !

పరిజనము

ప్రభువు నాజ్ఞ ! (నిష్క్రమించును)

రాజు

సెబ్బర పులుఁగు కానవచ్చుటలేదు.

విదూషకుఁడు

ఇటు ! ఇటు ! దక్షిణమువైపుగా బోయినది. ఆ శకుని హతాశము !

రాజు

(చూచి)

ఇప్పుడు —

వెలుఁగు చివురులతోఁ గనువిందొనర్చు
పూఁగుత్తి ! యిమ్మణితోడ - పులుఁగు, పేర్మి
స్తబకితాశోక కుసుమ వితానములను
దీర్చె నవతంసకమ్మును దిఙ్ముఖమున (142)

యవని

(ధనుశ్శరహస్తయై ప్రవేశించి)

దొరా ! యివిగో ! విల్లమ్ములు -

రాజు

ఇప్పుడు ధనస్సుతో నేమి ప్రయోజనము? పొలదిండి యలుఁగువేటు దాటి పోయినది.

మిగుల దవ్వేగు కొలఁది నీఖగము; మింట
నిమ్మహామణి దోఁచు సూక్ష్మమ్ముగాఁగ
ప్రచుర నైశ తమమ్ములఁ బరుష జలద
ఖండముఁ దోఁచు లోహితాంగుండు వోలె ॥ 143

(కంచుకి వంకఁజూచి)

ఆర్య ! లాతవ్య!

కంచుకి

మహారాజ ! యేమి సెలవు?

రాజు

నగరవాసు లెల్లరకు నా మాటగాఁ జెప్పుము.
"సాయం వేళకు నివాసవృక్షాగ్రమునఁ బక్షిని కనుగొనవలసిన" దని-

కంచుకి

దేవర యాజ్ఞ !

(అని నిష్క్రమించును)

విదూషకుఁడు

ఓయ్యోయి ! ఇప్పటికి నీవు విశ్రమింపుము. ఆ రత్నచోరుఁడు
నీ శాసనమును దాఁటికి యెచ్చటికిఁ బోఁగలఁడు?

(అని యిరువురును గూర్చుందురు)

రాజు

వయస్య !

రత్నమని కాదు; నాదు నారాట మొక్క-
పులుఁగు మింటికిఁ దన్నుక పోయినంత ;
అమ్మణి ఘటించెనాకుఁ బ్రియా సమాగ
మమ్ము; సంగమమణి; దాని మఱువఁ దరమె? 144

(పిమ్మట - శరసహితమైన మణితో కంచుకి ప్రవేశించును)

కంచుకి

జయము జయము ! దేవరకు !

ఇయ్యలుఁగె చీల్చినది వధ్య ప్రయ్యలుగను
రోపరూపమ్ము నొందు నీ కోపమిడియు ;
ఒగిఁ బతత్రి నిజాపరాధోచితముగఁ
బడియె తలతెగి; రత్నమ్ము పడియెఁ బుడమి. 145

(అందఱు విస్మయము రూపింతురు.)

కంచుకి

ఈ మణిని బాగుగఁ గడిగినాము. దీని నెవ్వరికిమ్మని సెలవు ?

రాజు

వేధ ! దీనిని కోశమంజూషయందు భద్రపఱుపుము.

కిరాతుడు

దొరముదల ! (అని మణిని తీసికొని నిర్గమించును)

రాజు

(కంచుకినిఁజూచి) అయ్యా ! యీ బాణమెవ్వనిదో నీకుఁదెలియునా ?

కంచుకి

ఏదోపేరున్నది. నాకు దృష్టియానదు.

రాజు

అయినచో - ఆ బాణమిటుతెమ్ము ! నిరూపింతును.

విదూషకుడు

ఏ మాలోచించుచుంటివి ?

రాజు

ప్రహర్త నామాక్షరములు వినుము !

విదూషకుఁడు

అవహితుఁడనై యున్నాను.

రాజు (చదువును)

"జనని యూర్వశి యైలుఁడు జనకుఁడెవని
కాధనుశ్శాలి పూఁపప్రాయంపు జోదు;
ఆయువు శరమ్ము విద్విషదాయువులకుఁ
జెఱుఁగు నియ్యది భీషణాశీవిషమ్ము !" 146

విదూషకుఁడు

భాగ్యవశమున మహారాజు సంతతితో వర్ధిల్లుచున్నాఁడు !

రాజు

ఇదియెట్లు ? సఖుఁడా ! అయ్యనిమిషయైన యూర్వశిని ఎడఁబాయకయే యుంటిని. ఆమెయందు నేనెన్నఁడును దౌహృదసాధారణములైన దోహదములను ఉపలక్షించి యుండలేదు. ఇఁక - ప్రసవ మెచ్చటినుండి ? కాని -

అవలఁ గడచన్న కొన్ని నాళ్లతివ తోఁచె
నావిల పయోధరాగ్రమ్ము నాననాంత
లలిత లవలీదళద్యుతి, గళిత వలయ
మృదు కృశాంగకమైన నెమ్మేనితోడ 147

విదూషకుఁడు

ఆమెకు మానుషీధర్మములను పట్టింపకుము ! దివ్యుల చరితములు ప్రభావ నిగూఢములై యుండును.

రాజు

నీవు చెప్పినట్లే యనుకొందము. కాని, కుమారుని దాఁచుటకుఁగల కారణ మేమై యుండును ?

విదూషకుఁడు

"వృద్ధురాలనైన నన్ను రాజు పరిహరింపకుండ నుండవలయు"నని.

రాజు

చాలును. పరిహాసము. కారణ మాలోచింపుము.

విదూషకుఁడు

దేవ రహస్యముల నెవ్వఁడు - ఊహింపఁగలఁడు ?

కంచుకి

(ప్రవేశించి) జయము జయము! దేవరకు!

చ్యవనాశ్రమమునుండి కుమారునిఁగైకొని తాపసి వచ్చి దేవర దర్శనమునకు వేచియున్నది.

రాజు

విలంబము లేక యిరువురిని ప్రవేశపెట్టుము.

కంచుకి

దేవరయానతి!

(నిష్క్రమించి తాపసీసహితుఁడైన కుమారుని గొనివచ్చును.)

విదూషకుడు

గృధ్రలక్ష్య వేదియైన శరముపై తన నామాంకము గల యీ క్షత్రియ కుమారుఁడు అచ్చముగ నిన్నే పోలియున్నాఁడు సుమా!

రాజు

అట్లే -

ప్రాలిన చూడ్కి యిన్నిసువుపై శశికాంతముమీఁద వెన్నెలల్
జాలయినట్టు లశ్రువుల జాల్గొనః; వత్సలతాను బంధియై
హాళి రహించుడెందము; సముంచిత ధైర్యము మాలి వేపథూ
ద్వేలములైన యంగములపై కవుఁగిలి కంగలార్చెదన్. 148

కంచుకి

భగవతీ! యిట్లు కూర్చుండుఁడు

(తాపసియును కుమారుఁడును యథోచితముగఁ గూర్చుందురు)

రాజు

(సమీపించి) భగవతి! నమస్కారము.

తాపసి

సోమకులమును వర్ధిల్లఁ జేయుము (తనలో) ఈరాజర్షికిని ఆయువునకును గల యౌరస సంబంధము చెప్పకయే తెలియుచున్నది.

(ప్రకాశముగ) బిడ్డా! తండ్రికిఁ బ్రణమిల్లుము!

(కుమారుఁడు అశ్రుగర్భితమైన దోసిలి యొగ్గి ప్రణమిల్లును.)

రాజు

వత్స! ఆయుష్మంతుఁడ వగుము!

కుమారుఁడు

(స్పర్శమును రూపించి తనలో)

"తండ్రి యీతఁడ నాకు, నేఁ దనయుఁడ"నని
వినినయంత గుండియ యిట్లు ద్రవీభవింప
నొడివిఁ బ్రేముడి లాలింపఁబడు సుకృతుల
కెడఁదలందు పితృస్నేహ మెట్టి దగునొ! 149

రాజు

భగవతి! మీరు వచ్చిన పనియేమి?

తాపసి

మహారాజ! వినుము. ఈ దీర్ఘాయువగు - ఆయువు పుట్టినయంతనే ఊర్వశి ఒక నిమిత్తమున నాహస్తమునందు న్యాసముగ నుంచినది. భగవంతుఁడగు చ్యవన మహర్షి యీతనికి క్షత్రియోచితమగు

జాతకర్మాదికము నొనరించెను. ఈతఁడు గృహీత విద్యుఁడు, ధనుర్వేదము నందు వినీతుఁడు!

రాజు

నాథ వంతుఁ డయ్యెను.

తాపసి

నేఁడు సమిత్కుశాహరణార్థము ఋషికుమారులతోఁ గలసి - యేగి- యితఁ డాశ్రమ విరుద్ధమైన కృత్య మొనరించెను

రాజు

ఏ రీతిగ?

తాపసి

మాంసఖండము నోటఁ గఱచికొని గ్రద్ద ఆశ్రమ తరుశిఖరమున దాఁగికొను చుండఁగా- తన బాణమునకు లక్ష్య మొనరించెను.

రాజు

ఆపైన ?

తాపసి

ఈవృత్తాంతము తెలిసి భగవంతుఁడగు చ్యవనమహర్షి- ఊర్వశీ హస్తమునందు న్యాసమును ప్రత్యర్పిత మొనర్పవలసినదని నన్నాదేశించెను. కావున నేను - ఊర్వశినిఁ జూడఁ గోరుచున్నాను.

రాజు

అయినచో - భగవతి యీ యాసనము నను గ్రహించునుగాక!
(తాపసీ - కుమారులు పరిజనము తెచ్చిన ఆసనములపైఁ గూర్చుండురు)

రాజు

లాతవ్య! ఊర్వశిని పిలువుము.

కంచుకి

దేవర యానతి!

(అని నిష్క్రమించును)

రాజు

(కుమారునిఁ జూచి)

వత్సా! రారమ్ము!

విందు శ్రుతుల సర్వాంగీణ విదితమనుచుఁ
బ్రాణు లెల్లరకును సుతస్పర్శసుఖము
సవదరింపు నామెయి నది చంద్రకాంతిఁ
జంద్రకాంతోపలంబట్లు జలదరింప

తాపసి

బిడ్డా! తండ్రిని ఆనందింపఁజేయుము

(కుమారుఁడు రాజును చేరవచ్చును)

రాజు

(కౌఁగిలించుకొని)

వత్సా! నా ప్రియసఖుఁడగు బ్రాహ్మణునికి బెరుకు లేకుండ వందన మొనర్పుము.

విదూషకుఁడు

దేనికి బెరుకు ? ఆశ్రమములో శాఖామృగమును జూచియే యుందును

కుమారుఁడు

(సస్మితముగ)

తాత! నమస్కరించుచున్నాను.

విదూషకుడు

నీకు స్వస్తి యగుత! వర్ధిల్లు!

పిమ్మట ఊర్వశి, కంచుకియు ప్రవేశింతురు

కంచుకి

దేవీ! ఇటు ఇటు!

ఊర్వశి

(ప్రవేశించి) మహారాజు తనకూఁకటులు సవరించుచుండ కనక పీఠమున - ఆ కూర్చున్న దెవ్వరో!

(తాపసినిఁ జూచి)

అహో! సత్యవతి ప్రక్కనున్న యీతఁడు నాపుత్త్రుఁడు ఆయువే! ఎంత వాడయ్యెనో!

రాజు

(విలోకించి) తండ్రీ!

మీ తల్లి విన్నగవు గొన
చేతము కళవళ పడంగఁ జేరెడి నిదిగో!
ప్రీతి ప్రస్నవ భిన్న
స్ఫీతపయోధర పటంబుఁ జేర్చుచుఁ బైపై 151

తాపసి

నాయనా! రమ్ము! మీ అమ్మ దగ్గఱకు వెళ్ళుము.

(అని కుమారునితో సహ ఊర్వశిని జేరవచ్చును)

ఊర్వశి

ఆర్యులారా! పాద ప్రణామము చేయుచున్నాను

తాపసి

బిడ్డా! పతికి బహుమానపాత్రురాలవు కమ్ము

కుమారుండు

అమ్మా! నమస్కరించుచున్నాను.

ఊర్వశి

వత్సా! తండ్రి నారాధింపు చుండుము.

(రాజును చూచి)

జయము జయము! మహారాజునకు!

రాజు

పుత్త్రవతీ! స్వాగతము ఇచ్చటం గూర్చుండుము.

(అందఱు యథోచితముగం గూర్చుండురు.)

తాపసి

బిడ్డా! ఊర్వశీ! నీకొడుకు ఆయువు విద్యలెల్లం గఱచి యిప్పుడు కవచ ధారణమున కర్హమగు వయస్సు వచ్చినాండు. నీవు నాయందు నిక్షేపించిన యీ న్యాసము ధర్మసమక్షమున నీకు ప్రత్యర్పితమైనది. కావున నన్ను విడువంగోరుదును నాయాశ్రమ ధర్మము నుపరోధింపం బడుచున్నది

ఊర్వశి

తరవుగ నార్యపుత్త్రునిఁ జూచిన పిమ్మట - ఆశ్రమ ధర్మమును భావించుటకు హృదయ మవహిత మగుచున్నది. కావున ఆర్యురాలి పునర్దర్శన మగుగాక!

రాజు

పూజ్యుఁడగు చ్యవన మహర్షికి నా ప్రణామము నివేదింపఁగలవు.

తాపసి

అట్లే

కుమారుఁడు

అవ్వా! నీవు వెళ్లుట నిజమేనా? అయిన - ఇటనుండి నన్నుగూడఁ గొనిపొమ్ము!

రాజు

ఓయి వత్సా! నీవు మొదటి యాశ్రమమున నుంటివి. ఇఁక నీవు రెండవ యాశ్రమము నధిష్ఠింపవలసిన సమయము!

తాపసి

వత్సా! తండ్రిమాట చేయుము.

కుమారుఁడు

అయినచో మఱి -

నెఱరుమై తలకుచ్చునే విమురమోడ్పుఁ
గనుల నాయొడినే కూర్కుఁగనెడి దాని
విపుడిపుడె పించియము మోఁకెత్తు నెమ్మి
కాఁ దింపవె! నా "శితికంఠకమ్ము" 152

తాపసి

అట్లే చేయుదును.

ఊర్వశి

భగవతి ! పాదవందనము చేయుచున్నాను.

రాజు

భగవతి ! ప్రణామము

తాపసి

మీకు స్వస్తియగుత ! (అని నిష్క్రమించును)

రాజు

వనిత ! నీ తనయుచేతనెకదా ? పుత్త్రి
జనకుల నేఁడగ్ర గణనీయుఁడైతి !
పౌలోమి గర్భంబు పంటయై వెలయు
నా జయంతునిచే బిడౌజుని వోలె 153

(ఊర్వశి తలపోసికొని యేడ్చును)

విదూషకుఁడు

ఇప్పుడీమె కంట నీరిడుచున్నదేలనో ?

రాజు

(సావేగముగ)

వందుర నేటికే చెలువ ? వారిజ వైరికుల ప్రరోహమై
నందనుఁడంచు నేటికిఁగనంబడి నాయెద నిర్వృతిం గనన్
జిందిన బాష్పబిందువులఁజేర్చెదు వెండియు నున్నతస్తనా
శిందములందుఁ గాంతి తరళీకృత మౌక్తిక సూత్రదామముల్ 154

ఊర్వశి

మహారాజ ! వినుము. మొదట పుత్త్ర సందర్శన జనితానందమువలన విస్మరించితిని. ఇప్పుడు బిడౌజుని ప్రసక్తి వలన నాటి సమయము తలఁపునఁ బొటినది.

రాజు

ఆ సమయమెట్టిదో వినిపింపుము.

ఊర్వశి

పూర్వము నేను మహారాజానందలి పరాకుచేత గురుశాపమునకు పాత్రమై మతిమాలి యున్నపుడు మహేంద్రుఁడు - ఒక సమయమును విధించి నాకభ్యనుజ్ఞ నిచ్చెను.

రాజు

ఏమని ?

ఊర్వశి

'నా ప్రియ వయస్యుఁడగు పురూరవసుఁడు నీయందుకలిగిన తన ఆత్మజుని మోము నెన్నఁడు చూచునో - అప్పుడు మఱల నీవు నాసమీపమునకు రావలసి యుండు" నని -

మహారాజ వియోగభీరుతనగు నేను - ఆకారణము వలన నితఁడు పుట్టిన వెంటనే చదువుల నిమిత్తమని భగవంతుఁడగు చ్యవన మహర్షి యాశ్రమములో సత్యవతీ హస్తమునందు న్యాసముగ నిక్షేపించితిని. దీర్ఘాయువగునాయువు నేటికి పితృశుశ్రూషా సమర్థుఁడయ్యెనని యిచ్చటికి మఱలింపఁబడెను. కావున - నేను మహారాజుతోఁగలసి యుండుట యింతవఱకే.

(అందఱు విషాదము రూపింతురు రాజు మోహమును పొందును)

అందఱు

మహారాజ! ఊరడిల్లుము! ఊరడిల్లుము!

కంచుకి

మహారాజ ! ఊరడుము!

విదూషకుఁడు

అయ్యో! అయ్యో!

రాజు

(తేరుకొని) అహో! దైవమునకు సుఖముపై నెంతటిపగ?

ఊరడి యుండ నెమ్మది సుతోదయ భాగ్యవిశేష నిర్వృతిన్
వారక దాని వెంబడిన వచ్చెను నీ విరహంబలంఘ్యమై
నీరజనేత్ర! యేమనఁగ? వింగిదెసన్ దొలికారు జల్లుచే
నాఱిన తాపమౌ తరువునంబడు వైద్యుత వహ్నియో యనన్॥ 155

విదూషకుఁడు :

ఇంక వల్కలమును గట్టి ప్రియవయస్యుఁడు తపోవనమునకుఁ బోవలసి యుండుట వలన- పుత్రిసమాగమ రూపమగు నీయర్థము- అనర్థాను బంధియే యని యూహించుచున్నాను.

ఊర్వశి

హా! నేనెంతటి మందభాగ్యురాలను? యోగ్యపుత్త్రిలాభము పిమ్మట స్వర్గారోహణము చేయవలసిన నేను వియోగవిమనస్కనై యున్నను నాప్రయోజనము తీఱిపోయినట్లు నన్ను మహారాజు తలంచును గాబోలును!

రాజు

అట్లను కొనకుము !

సులభ వియోగమెన్నటికి సుందరి! యీపరతంత్రభావ, మి
మ్ములను సహింపదాత్మ సుఖమున్; త్రిదశేంద్రునియాన విల్వమీ!
అలయక యేను నీ తనయుఁ డాయువు నందిడి భూభరంబు, కా
నల ముని వృత్తి నొంచు హరిణమ్ములలోనఁ జరింతునెమ్మదిన్ 156

కుమారుడు

పుంగవధారితమైన భారమునందుఁ దఱపిదూడను నియోజింపఁ జూచుట నాయనగారికి భావ్యము కాదు.

రాజు

ఓయి వత్సా! అట్లనవలదు.

కలభ దశాస్థితంబయిన గంధగజం బొడుచున్ బరద్విపం
బుల; భుజగార్భకంబున సముద్ధత వేగమగున్ గదా! విష
జ్వలనము; భూమిపాలుఁడును బాల్యదశాగతుఁడయ్యు నోపు భూ
వలయముగావ; పుట్టుకనుబట్టి స్వకార్యసహమ్ము లిన్నియున్॥ 15

రాజు

ఆర్య! లాతవ్య!

కంచుకి

దేవర! ఆజ్ఞాపింపుఁడు!

రాజు

ఆయుష్మంతునకు రాజ్యాభిషేకము నమకూర్ప వలసినదని నామాటగా అమాత్య పర్వతునితోఁ జెప్పుము.

(కంచుకి దుఃఖముతో నిష్క్రమించును)

(అందఱు చూడ్కి మిఱుమిట్లు గొనుట నిరూపింతురు)

రాజు

(ఆకాశము వంకఁజూచి) ఎచ్చటినుండి యీ మెఱుపు?

(నిపుణముగా పరిశీలించి) ఓహో! భగవంతుఁడు నారదుఁడు!

గోఱజపు వన్నె జడలును
దాఁటిన వెన్నెలల జన్నిదపు దారములన్
జేరుఁగు ముత్తెముల సిం
గారములన్ హొన్న కల్పకము చేరునిదే! 158

అర్ఘ్యమర్ఘ్యము

ఊర్వశి

ఇదిగో! భగవంతున కర్ఘ్యము!

(నారదుఁడు ప్రవేశించును)

నారదుఁడు

మధ్యమలోక పాలునకు విజయమగుగాక!

రాజు

భగవంతుఁడా! ప్రణామము.

ఊర్వశి

భగవంతునికు ప్రణామము.

నారదుఁడు

విరహము లేని దంపతులై వర్ధిల్లుఁడు!

రాజు

(తనలో) ఒకవేళ నిట్లు జరుగునేమో ? (ప్రకాశముగా)
(కుమారుని కౌఁగిలించికొని) వత్సా ! భగవంతునకుఁ బ్రణమిల్లుము.

కుమారుఁడు

భగవంతుఁడా ! ఔర్వశేయుఁడు ఆయువు ప్రణమిల్లుచున్నాఁడు.

నారదుఁడు

ఆయుష్మంతుఁడవై వర్ధిల్లుము.

రాజు

ఈ యాసనము ననుగ్రహింపుఁడు !

(నారదుఁడు కూర్చుండును. ఎల్లరును గూర్చుందురు.)

రాజు

(సవినయముగా) భగవంతుఁడా ! ఆగమప్రయోజనమేమి ?

నారదుఁడు

మహేంద్ర సందేశమును వినుము.

రాజు

అవహితుఁడనై యున్నాను.

నారదుఁడు

వనవాసమున కుద్యుక్తుఁడవైన నిన్ను ప్రభావదర్శియైన మహేంద్రుఁడను శాసించుచున్నాఁడు.

రాజు

ఏమని యాజ్ఞ?

నారదుఁడు

" త్రికాలద్రష్టలు సురాసురయుద్ధము రాఁబోవుచున్నదని ఆదేశించుచున్నారు సాంయుగీనుఁడవైన నీవు మాకు సహాయుఁడవు! ఆకారణమున నీవు శస్త్ర సన్న్యాసము చేయఁదగదు
ఈ యూర్వశియు యావజ్జీవము నీకు సహధర్మచారిణియై యుండు "
అని —

ఊర్వశి

(అపవారించి)

హృదయశల్యము పెఱికివేసినట్లైనది

రాజు

పరమేశ్వరుఁడు నన్ను నిరవధికముగ ననుగ్రహించినాఁడు

నారదుఁడు

సముచితమే.

నీయభీప్సిత మింద్రుండు నిర్వహింప
నోపి వాసవు కార్యంబు లూను మీకు
అ విభావసుఁ బ్రోఁది వేయంగ భానుఁ
డగ్ని నిజతేజమునఁ బెంచు నబ్జహితుని 159

రంభా ! కుమారునకు మంత్రపూతమగు నభిషేకసంభారము గొనితెమ్ము !

రంభ

ఇదిగో ! యీతని కభిషేక సంభారము !

నారదుఁడు

ఈ యాయుష్మంతుఁ భద్రపీఠమునఁ గూర్చుండఁబెట్టుము !

(రంభ కుమారుని భద్రపీఠమునఁ గూర్చుండఁబెట్టును.)

నారదుఁడు

(కుమారుని శిరస్సునందు కలశమును వంచి)

రంభా ! యీతనికి శేషవిధిని నిర్వర్తింపుము !

రంభ

(యథోక్తముగ నిర్వర్తించి)

వత్సా ! భగవంతునకును తల్లిదండ్రులకును ప్రణమిల్లుము

(కుమారుఁడెల్లరకును ప్రణమిల్లును.)

నారదుఁడు

నీకు స్వస్తియగుత !

రాజు

కుల ధురంధరుఁడవు కమ్ము !

ఊర్వశి

తండ్రి నారాధించుచుండుము !

(తెరలో వైతాళికద్వయము.)

ప్రథముఁడు

యువరాజునకు విజయమగుగాక !

అల సురవంద్యుఁడత్రిముని యాత్మభువుంబడి; యత్రివెంబడిన్
జలువలఱేఁడు; వానిబడి సౌమ్యుఁడు; సౌమ్యునివెంట నైలుఁడున్
వలనుగ నైలువెంట జనవంద్యుఁడ వీ విటులే క్రమాగతం
బులయిన లోకకాంతగుణముల్ వెలుఁగొందుత! మీకొలంబునన్ 160

ద్వితీయుఁడు

ధర నున్నతులలోనఁ బరమోన్నతుండు
చిరకీర్తి మీతండ్రి సురనుతునందు
అవికంపనీయ ధైర్యాంబుధి వగుచు
నవికల స్థితి శాలివైన నీ యందు
తేజరిల్లుచుఁ బురాధిపశోభనిపుడు
రాజిల్లు చుండెఁబో! రాజ్యలక్ష్మి
ఆ హిమాలయ సముద్రాలీఢ విపుల
వాహినియై గంగ వఱలెడి భంగి॥ 181

రంభ

భాగ్యవశమున ప్రియసఖి కుమారుని యౌవరాజ్యసంపత్తినిఁ జూచుచు విరహము లేని భర్తృసమాగమముతో వర్తిల్లు చున్నది.

ఊర్వశి

ఈయభ్యుదయానందము మన యిరువురకు సమానమే.

(కుమారుని హస్తమున గ్రహించి)

నాయనా! పెదతల్లిగారికి నమస్కరింప వలయును!

రాజు

నిలువుము! ఆమె యొద్దకు మనము కలసియే పోవుదము

నారదుఁడు

ఆత్మఁ దలఁపించు చున్నది; యాయువునకు
నొనరు నీయౌవరాజ్యమహోదయమ్ము
చెలఁగి తొలినాఁడు సురపతిచేత దేవ
సేన కభిషిక్తుఁడగు మహాసేను మహము

రాజు

మఘవునిచేత అనుగ్రహింపఁబడితిని

నారదుఁడు

ఓయి రాజా! మఱియును నీకు పాకశాసనుఁ డొనరింప వలసిన ప్రియమేమి?

రాజు

ఇంతకు మించిన ప్రియమును కూడ నుండునా ? అదికాక - భగవంతుఁడగు పాకశాసనుఁడు ప్రియమొసరించునేని అప్రియము వలన-

భరత వాక్యము-

ఒకరొకరికిఁ బడమిని, విము
డక యొకచో వేఱువేఱెడల నెదమగుగై

తిక మకలగు శ్రీభారతు
లకుఁ గలయిక కలిగి సత్కాలంబు పొదలుతన్ 163

మఱియును-

ఎల్లవారలు విక్కట్టులేఁద వలయు
నెల్లవారలు భద్రమ్ము లెనయవలయు
నెల్లవారల కోర్కె ఫలింపవలయు
నెల్లవారెల్లచో సుఖియింప వలయు 164

(అందఱు నిష్క్రమింతురు)

ఇది పంచమాంకము

సమాప్తము

BLANK PAGE

BLANK PAGE

మల్లంపల్లి శరభయ్యశర్మ

గ్రంథములు :-

1. కుమారసంభవము రు 3/-
(కాళిదాసకృతికి తెనుగు)

2. మాలవికాగ్నిమిత్రము రు 3/-
(కాళిదాసకృతికి తెనుగు)

3. శ్రీ వేణుగోపాల శతకము - స్వీయరచన - రు 3/-
(వరల్డు టీచర్ ట్రస్టు ప్రచురణ)
విశాఖపట్నం - 530 002

4. విక్రమోర్వశీయము
(కాళిదాసకృతికి తెనుగు)

5. పద్యకావ్య మంజరి (అచ్చులోనున్నది)

ప్రాప్తి స్థానము : గ్రంథకర్త పేరిట.
మల్లయ్యపేట మొదటివీధి
రాజమండ్రి - 533105